Follow: @ANNTELUGU
26-07-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 232 | పేజీలు-08 | వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



## ఫ్యూడల్ ధోరణితో అన్యాయం చేస్తే
# తిరుగుబాటు తప్పదు
### సకల జనుల సమ్మె తరహాలో ఉద్యమిస్తాం

- ముస్లింల పేరుతో బీసీల నోటి కాడ కూడు లాక్కోవద్దు
- బీసీ బిల్లు తిరస్కరిస్తే రాష్ట్ర బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి
- కేంద్రంపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం, వాకిటి శ్రీహరి ఫైర్


**ఢిల్లీ, మహా:** కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ శాతం కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన బిల్లుపై బీజేపీ వైఖరి సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీ బిల్లుపై బీజేపీకి అభ్యంతరం ఉంటే అసెంబ్లీలోనే ఎందుకు చెప్పలేదని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఫ్యూడల్ ధోరణితో అన్యాయం చేస్తే తిరుగుబాటు చేస్తామని పొన్నం హెచ్చరించారు. ముస్లింల పేరుతో బీసీల నోటి కాడి కూడు లాక్కోవొద్దన్నారు పొన్నం. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రామచంద్రరావుకు బీజేపీ అధ్యక్ష పదవి ఇచ్చారని విమర్శించారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

## 28న తెలంగాణ కేబినెట్

- మంత్రుల ఢిల్లీ పర్యటన నేపథ్యంలో వాయిదా
- హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్



03

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను!

- బీజేపీని బలోపేతం చేసి పవర్‌లోకి తీసుకొస్తా
- భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై కోర్టును ఆశ్రయిస్తా
- కన్వర్టెడ్ బీసీ పదాన్ని తెచ్చిన రేవంత్‌కు ప్రైజ్ ఇవ్వాలి
- హైడ్రాతో ఇండ్లు కూల్చినట్లు ప్రభుత్వం కూడా కూలుతుంది
- చిట్ చాట్‌లో టీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు



02

## డీలిమిటేషన్ పక్కా

- 2026 ఎంతో దూరంలో లేదు
- మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్



02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,00,480 |
| 22 క్యారెట్ | 92,100 |
| సిల్వర్ (కేజీ) | 1,18,000 |





# ఎయిర్ పోర్టులు వస్తున్నాయ్

## వరంగల్ రయ్..రయ్.. ఆదిలాబాద్‌కు సైసై

### వరంగల్‌కు భూసేకరణకు నిధులు విడుదల

- ఆదిలాబాద్ విమానాశ్రయానికి ఎయిర్ ఫోర్స్ గ్రీన్ సిగ్నల్
- రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపిన అధికారులు
- ముఖ్యమంత్రి రేవంత్ పట్టుదలతో అనుమతులు చకచకా

**హైదరాబాద్, మహా :** తెలంగాణకు ఎయిర్ పోర్టుల పంట పండుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో తెలంగాణకు మరో రెండు ఎయిర్ పోర్టులు రానున్నాయి. ఈ ఏడాదే వరంగల్ ఎయిర్ పోర్ట్ పనులు ప్రారంభం కానుండగా, భూసేకరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కూడా గ్రీన్ సిగ్నల్ లభించగా, భూసేకరణ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించే అవకాశాలున్నాయి. రెండు ఎయిర్ పోర్ట్ లను రెండున్నరేళ్ళలో పూర్తిచేయాలని రాష్ట్ర సర్కారు భావిస్తోంది. రామగుండం, కొత్తగూడెం, నిజామాబాద్ ఎయిర్ పోర్ట్ లకు కూడా ప్రతిపాదనలుండగా.. ఇంకా అనుమతులు రావాల్సి ఉంది. కేంద్రప్రభుత్వం వద్దకు తరచూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్ళి ఒత్తడి చేయడం, పౌరవిమానయాన శాఖా మంత్రిగా తెలుగువారైన రామ్మోహన్ నాయుడు ఉండడం ఎయిర్ పోర్టుల ప్రక్రియ ముందుకు కదిలేందుకు మార్గం సుగమమైంది. అసెంబ్లీ వేదికగా తెలంగాణలో వరంగల్ కు ఎయిర్ పోర్టు తెచ్చిన.. ఆదిలాబాద్ కు కూడా తెచ్చేది నేనే అని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతులు సాధించారు.

మిగతా 2లో

## ఆ రెండింటికీ రెడ్ సిగ్నల్

తెలంగాణ పంపిన ప్రతిపాదనను పరిశీలించిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా .. రామగుండం, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుల ఏర్పాటు సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ రెండు ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టు స్థలానికి సమీపంలో పెద్ద ఎత్తున కొండలు, గుట్టలు ఉన్నాయని.. దీంతో అక్కడ విమానాలు దిగడం సాధ్యం కాదని, కనుక ఈ రెండు ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్‌ల ఏర్పాటు కుదరదని తేల్చిచెప్పింది. ప్రత్యామ్నాయ భూసేకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటికి అనుమతులు రావాల్సి ఉంది.

# ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

## ఇండియా కూటమికి షాక్.. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాలని ఈసీ నిర్ణయం
అర్హులను తొలగించి.. అనర్హులను చేర్చేందుకేనంటూ విపక్షం ధ్వజం





**ఢిల్లీ, మహా :**

కేంద్ర ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం తీసుకుంది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించడం చాలా ముఖ్యమని ప్రకటించింది. ఓటర్ల జాబితాల సమగ్రతను కాపాడటానికి దేశవ్యాప్తంగా ఎస్ఐర్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం షెడ్యూల్ ను నిర్ణీత సమయంలో జారీ చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

**ఇదీ ఉత్తర్వుల సారాంశం**

- భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ, నియంత్రణ, దిశానిర్దేశం చేసే అధికారం ఈసీకి ఉంది.
- స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించడానికి ఎస్ఐఆర్ నిర్వహించడం చాలా ముఖ్యం.
- ఎన్నికల యంత్రాంగం, ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించిన విధానం అనేవి ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, ప్రజాప్రాతినిధ్య చట్టం 1960 ప్రకారం జరుగుతాయి.
- గతంలో 195256, 1957, 1961, 1965, 1966, 198384, 198789, 1992, 1993, 1995, 2002, 2003 2004లో ఈసీ ఎస్ఐఆర్ ను చేపట్టింది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలను కొత్తగా తయారు చేయడం కోసం ఎస్ఐర్ ను చేపట్టింది.

మిగతా 2లో



## తెలంగాణ ఏర్పాటుకు సోనియా పోరాటం

- రాష్ట్ర ప్రజలతో కాంగ్రెస్ బంధం సుస్థిరం
- తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసింది
- రాహుల్ గాంధీ ప్రశంసలు

వివరాలు 2లో

స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,463.09 |
| నిఫ్టీ ↗ | 24,837 |

ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.25 | 127.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.8 | 127.5 |
| రిటైల్ గుడ్డు ధర | 4.51 | 135.15 |

## కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కామారెడ్డి, హైదరాబాద్, మహా:** 'కేసీఆర్ కావాలో, కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలి. మీ నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాము.. రైతు రుణమాఫీ, 50వేల కోట్లు చెల్లించాల్సి ఉంటే 12వేల కోట్లు మాత్రమే చెల్లించారంటూ అంటూ మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండల కేంద్రంలో ఆత్మగౌరవ గర్జన సభలో మాట్లాడుతూ..

మిగతా 2లో






ఏపీ, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై
## పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

వివరాలు 2లో

# పాలిటిక్స్‌లో మోదీ సరికొత్త రికార్డు

### అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా ఘనత
### 4,078 రోజులు పూర్తి చేసి ఇందిరా గాంధీ రికార్డు సైతం బ్రేక్



**ఢిల్లీ, మహా:** పాలిటిక్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన ఘనత సాధించారు. చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 25 జూలై 2025 నాటికి ఎక్కువ కాలం భారత ప్రధానిగా ( 4,078 రోజులు) పనిచేసిన రెండో వ్యక్తిగా ఆయన నిలిచారు. గతంలో 1964 నుంచి 1977 మధ్య నిరంతరాయంగా దేశాన్ని అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా దివంగత ఇందిరా గాంధీ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన తొలి వ్యక్తిగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిలవగా, ఆయన తర్వాత ప్రస్తుతం ప్రధాని మోదీ రెండో స్థానంలో నిలిచారు.

**ఇందిరా రికార్డు బ్రేక్..**

జూలై 25తో ప్రధాని మోడీ వరుసగా మూడు పర్యాయాలు 4,078 రోజుల పదవి కాలాన్ని పూర్తి చేసుకున్నారు. దీంతో ఆయన భారతదేశంలో వరుసగా అత్యధిక కాలం ప్రధానమంత్రిగా పనిచేసిన రెండో వ్యక్తిగా నిలిచారు.

మిగతా 2లో

## ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ప్రారంభించిన ఈసీ

- రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్
- సహాయ రిటర్నింగ్ అధికారులుగా గరిమా జైన్, విజయ్ కుమార్

02

# పాలిటిక్స్‌లో మోదీ సరికొత్త రికార్డు

## అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా ఘనత

4,078 రోజులు పూర్తి చేసి ఇందిరా గాంధీ రికార్డు సైతం బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

జనవరి 24, 1966 నుండి మార్చి 24, 1977 వరకు వరుసగా 4,077 రోజులు ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీని అధిగమించి ప్రధాని మోదీ రెండో స్థానంలోకి వచ్చారు. ఇందిరా గాంధీ 14 జనవరి 1980 నుండి అక్టోబర్ 31, 1984న ఆమె హత్యకు గురయ్యే వరకు ప్రధానమంత్రిగా కూడా పనిచేశారు. ఆమె తండ్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆగస్టు 15, 1947 నుండి మే 27, 1964 వరకు 16 సంవత్సరాల 286 రోజులు ప్రధానిగా పనిచేసి, భారత దేశానికి అత్యధిక కాలం ప్రధానమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. ప్రధానమంత్రిగా రెండు పదవీకాలాలను పూర్తి చేసుకొని వరకుసగా మూడోసారి కూడా ప్రధానిగా ఎన్నికైన మొదటి ఏకైక కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా కూడా నరేంద్ర మోదీ నిలిచారు. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ సాధించిన మొదటి కాంగ్రెసేతర నాయకుడు కూడా నరేంద్ర మోదీనే!



# డీలిమిటేషన్ పక్కా

- 2026 ఎంతో దూరంలో లేదు
- మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్

**హైదరాబాద్, మహా :** 2026 ఎంతో దూరంలో లేదని.. త్వరలోనే డీలిమిటేషన్ జరుగుతుందని మాజీఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ను పార్లమెంటులో 'సబ్జెక్ట్ టు' అనే పదాన్ని 'నాట్‌విత్‌స్టాండింగ్'తో సవరించి ఉంటే ఇరు రాష్ట్రాల శాసనసభల సీట్లు పెరిగేవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ 2014 2019 కాలంలో ప్రధానమంత్రి దృష్టికి చాలాసార్లు తీసుకెళ్లిందని.. సవరణ చేయాలని విన్నవించామని వెల్లడించారు. కానీ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ని సవరించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. దానిని సవరించడానికి ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును 2015లో లోక్‌సభలో తాను ప్రతిపాదించినట్లు తెలిపారు. 2026 తర్వాత నిర్వహించిన జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ ప్రారంభం అవుతుందని సుప్రీంకోర్టు తాజాగా కేసును కొట్టివేసిందని పేర్కొన్నారు.

# 28న తెలంగాణ కేబినెట్

**హైదరాబాద్, మహా:** శుక్రవారం జరగాల్సిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగాల్సిన కేబినెట్ సమావేశానికి ఐదుగురు మంత్రులు ఢిల్లీలో ఉండటంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం, మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ఐదుగురిలో ముగ్గురు మంత్రులు.. పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి.. ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ ఓబీసీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్ళడంతో వాయిదావేశారు.

**ఢిల్లీలో బిజీ.. బిజీ**

కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు నేతలు ఢిల్లీకి వెళ్లారు. ఇతర ఇద్దరు కీలక మంత్రులు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. పార్టీలో కీలక చర్చలు, సమావేశాల నిమిత్తం వారు అక్కడే మకాం వేసినట్లు తెలుస్తోంది. కాబట్టి, మంత్రివర్గ సమావేశం పూర్తిస్థాయి హాజరుతో నిర్వహించాలనే ఉద్దేశంతో, సీఎం రేవంత్ రెడ్డి 28వ తేదీకి మళ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. ముఖ్యంగా రైతుల సమస్యలు, వానాకాలం సాగు, విద్యుత్ సరఫరా, కొత్త పాలసీలు, భూసర్వేలు, ఋణమాఫీ తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు.

# ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)




బిహార్ లో చివరిగా ఎస్ఐఆర్‌ను 2003లో ఈసీ నిర్వహించింది.

- అర్హులెవర్నీ ఓటరు జాబితా నుంచి తొలగించం. అర్హులైన పౌరులందరిని ఓటర్ల జాబితాలో చేర్చం.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం భారత పౌరుడిగా ఉండి, అర్హత తేదీ నాటికి 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు లేని ప్రతి వ్యక్తి ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి అర్హులు
- గత 20ఏళ్లలో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, తొలగింపులు జరిగాయి. దీని కారణంగా ఓటర్ల జాబితాలో గణనీయమైన మార్పు జరిగింది. వేగవంతమైన పట్టణీకరణ, జనాభా తరచుగా ఒక ప్రదేశం నుంచి మరొక చోటుకు వలస వెళ్లడం వల్ల ఈ మార్పులు జరిగాయి. కొంతమంది ఓటర్లు ఒక చోట ఓటు హక్కును నమోదు చేసుకుని, మరొక చోటుకు వెళ్లిపోతారు. కానీ అసలు నివాస స్థలంల ఉన్న దగ్గరే వారి ఓట్లు ఉంటాయి. అందుకే ప్రతి వ్యక్తిని ఓటరుగా నమోదు చేసుకునే ముందు ధ్రువీకరించడానికి ఎస్ఐఆర్ అవసరం.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఒక వ్యక్తి తన పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలంటే అతడు/ఆమె భారతీయ పౌరుడిగా ఉండాలి.
- ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 21 సహా ఇతర నిబంధనల ప్రకారం ఎస్ఐఆర్‌ను నిర్దేశించే అధికారం ఈసీకి ఉంది.
- ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడటానికి దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ను ప్రారంభించాలని ఈసీ నిర్ణయించింది. అయితే ఈ ఏడాది చివర్లో బీహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్నందున అక్కడి తొలుత ఎస్ఐఆర్ చేపట్టాలని ఈసీ నిర్ణయం తీసుకుంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో ఎస్ఐఆర్ కోసం షెడ్యూల్ ను సకాలంలో జారీ చేస్తాం.
- బీహార్‌లో చివరి ఎస్ఐఆర్ 2003లో చేపట్టాం. 01012003 అర్హత తేదీని అప్పట్లో నిర్ణయించాం.
- 2003 ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాని ఏ వ్యక్తి అయినా అర్హత గల పత్రాలను సమర్పించాలి. అప్పుడు వారు ఓటర్ లిస్ట్ లో చేరుతారు.

**ఎస్ఐఆర్‌పై పార్లమెంట్ లో రచ్చ**

బీజేపీ, దాని మిత్రపక్షాలకు లబ్ధి చేకూరే విధంగా బీహార్‌లో ఎస్ఐఆర్‌ను చేపడుతున్నారని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో విపక్షాల ఆరోపణలను ఎన్నికల సంఘం ఇటీవల ఖండించింది. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సమర్థించుకుంది. ఈసీ తన రాజ్యాంగ బాధ్యతలను స్పష్టం చేసింది. నకిలీ ఓటర్లను జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐ ఆర్ ను చేపట్టామని, దీని వల్ల ఓటర్లకు ఎలాంటి నష్టం ఉండబోదని తెలిపింది. ఇది పార్లమెంట్ ను కూడా కుదిపేస్తోంది. అర్హులను తొలగించి అనర్హులను చేర్చేందుకు బిజెపి పన్నిన కుట్ర ఇదని విపక్ష నేతలు రాహుల్ గాంధీ సహా అందరూ పార్లమెంట్ వేదికగా నిరసన తెలుపుతున్నారు. ఓ వైపు పార్లమెంట్ లో నిరసనలు సాగుతుండగానే దేశమంతా చేస్తామని ఈసీ పేర్కొనడం సంచలనంగా మారింది.

# ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ప్రారంభించిన ఈసీ

## రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్

### సహాయ రిటర్నింగ్ అధికారులుగా గరిమా జైన్, విజయ్ కుమార్





**న్యూఢిల్లీ, మహా :** నూతన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం, ప్రకటించింది. రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీని నియమించింది. ఆరోగ్య సమస్యలను పేర్కొంటూ సోమవారం సాయంత్రం పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. అయితే న్యాయ మంత్రిత్వ శాఖతో సంప్రదించి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ సమ్మతితో 2025 ఉపరాష్ట్రపతి ఎన్నికలకు మోదీని రిటర్నింగ్ అధికారిగా నియమించినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. రాజ్యసభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, సెక్రటేరియట్ డైరెక్టర్ విజయ్ కుమార్‌లను సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించినట్లు వెల్లడించింది.

కాగా, ఉప రాష్ట్రపతి ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లు పూర్తి కాగానే అతి త్వరలో షెడ్యూలు విడుదల చేస్తామని ఎన్నికల కమిషన్ బుధవారం తెలిపింది. నెల రోజుల్లో ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ పూర్తి కావొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు 10 వరకూ పదవీ కాలం ఉంది. కొత్త ఉప రాష్ట్రపతి మిగిలిన కాలానికి కాకుండా ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు. దేశంలో ఇప్పటిదాకా 16 సార్లు ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగ్గా నాలుగు సార్లే ఏకగ్రీవమైంది. మిగిలిన 12 సార్లు పోటీ జరిగింది. ఇందులో రెండు ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పోటీ చేశారు. 2022లో కాంగ్రెస్ అభ్యర్థి మార్గరెట్ ఆల్వాను ఓడించి జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి అయ్యారు. ఈసారి బీజేపీ సీనియర్ నేతనే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే కూటమి ఖరారు చేస్తుందని తెలుస్తోంది. తొలుత బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌తోపాటు మరో ఐదుగురు పేర్లు వినిపించినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

మరోవైపు, ఇండియా కూటమి తమ తరఫున ఒక ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని యోచన చేస్తున్నట్లు సమాచారం. పార్లమెంట్‌లో ఇండియా కూటమికి మెజారిటీ లేకపోయినప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటూ ఉండడం గమనార్హం. ఫలితంతో సంబంధం లేకుండా బలమైన సందేశాన్ని పంపే ఉద్దేశంతోనే ప్రతిపక్ష పార్టీల కూటమి పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఏపీ, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. జమ్ముకశ్మీర్‌లో పునర్విభజన చేసే సమయంలో ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది. 2026లో మొదటి జన గణన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని, గేట్లు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.



# ఫ్యూడల్ ధోరణితో అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదు

## సకల జనుల సమ్మె తరహాలో ఉద్యమిస్తాం

- ముస్లింల పేరుతో బీసీల నోటి కాడ కూడు లాక్కోవద్దు
- బీసీ బిల్లు తిరస్కరిస్తే రాష్ట్ర బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి
- కేంద్రంపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం, వాకిటి శ్రీహరి ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

కిషన్‌రెడ్డి, రామచంద్రరావులు బీసీ వ్యతిరేకులుగా పొన్నం పేర్కొన్నారు. తాము ఏ కుల సర్వే చేసినా కేంద్రం చేసేది ప్రామాణికం అవుతుందన్నారు.

**రేవంత్ రెడ్డి ఉన్నతవర్గానికి చెందినా..**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం మోసం చేస్తే ఊరుకునేది లేదని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. ఒక బీసీ మంత్రిగా.. బీసీ బిడ్డగా.. ఈ విషయంలో కపట వైఖరిని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అవలంభిస్తే.. తాము ప్రజల్లో ఎండగడతామని మంత్రి సురేఖ వార్నింగ్ ఇచ్చారు. బీసీ బిల్లును తాము అసెంబ్లీలో ప్రవేశపెట్టి.. కేంద్రానికి పంపిస్తే.. బీజేపీ దాన్ని ఆపిందని.. ఇది సరైంది కాదన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి దగ్గర ఉందని చెప్పారు. అయితే, దాన్ని ఒప్పుకుంటారా? లేదో రాష్ట్ర ప్రజలకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని సురేఖ డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేసే కార్యక్రమాలు చేయొద్దని బీజేపీని ఆమె హెచ్చరించారు. తమ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతవర్గానికి చెందిన నాయకుడైనా.. ఆయా వర్గాలను ఒప్పించి బీసీ హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ఈ దేశంలో దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోని కూడా తాము ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. ఇప్పుడు బీసీలకు రిజర్వేషన్లు ఇస్తున్నది కూడా మేమే అని మంత్రి సురేఖ వివరించారు. బీసీ బిల్లును వ్యతిరేకిస్తే బీజేపీకి తెలంగాణలో తగిన బుద్ధి చెప్తారని మంత్రి వాకిటి శ్రీహరి హెచ్చరించారు. సకల జనుల సమ్మె తరహాలో బీసీలు ఉద్యమిస్తారన్నారు.

# కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ నడి బొడ్డున ప్రపంచంలోనే అత్యధిక ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టింది కేసీఆరే. 26 శాతం ఉన్న దళిత గిరిజనులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని మాటిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది అని కేటీఆర్ దుయ్యబట్టారు. 'ఏడాదికి 60 వేల ఉద్యోగాలు ఏమయ్యాయి?. కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులకు రిబ్బన్‌లు కట్ చేయడం తప్ప కాంగ్రెస్ ఏమీ చేయడం లేదు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బట్టలు విప్పండి. మిస్ వరల్డ్‌లో లక్ష రూపాయల చొప్పున సుందరంగులకు ప్లేట్ భోజనాలు పెట్టావు. మరి దళిత బిడ్డలు చదివే వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ అయి చనిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుంది. పెట్టుబడి సాయం ఎకరానికి రూ.10వేలు ఇస్తే.. కాంగ్రెస్ రూ.15వేలు ఇస్తామని చెప్పింది. దళిత బంధు కింద రూ.10లక్షలు ఇస్తుంటే.. కాంగ్రెస్ రూ.12లక్షలు ఇస్తామంది. ఏమైంది'అని కేటీఆర్ విమర్శించారు.

# ఎయిర్ పోర్టులు వస్తున్నాయ్




(మొదటిపేజీ తరువాయి)

ఆదిలాబాద్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ఎయిర్‌ఫోర్స్ గ్రీన్స్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. ఇక ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 1500 ఎకరాలను సేకరించనున్నారు. ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయాన్ని.. రాష్ట్రంతో పాటు, ఎయిర్‌ఫోర్స్ సంస్థలు వినియోగించుకుంటాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో విమానాశ్రయాలు పెంచేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో వరంగల్‌లో విమానాశ్రయానికి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులు కేటాయించేందుకు అంగీకరించింది. వరంగల్ మామునూరు విమానాశ్రయానికి 205 కోట్ల రూపాయలు అవసరం అవుతాయంటూ అధికారులు ఇచ్చిన నివేదికకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**భూసేకరణకు నిధులు విడుదల**

వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.205 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మార్చి నెలలో పచ్చజెండా ఊపారు. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలుపెడతామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది.

**నిజాంకాలంలో వరంగల్**

వరంగల్ మామునూరులో నిజాం కాలంలో ఎయిర్‌పోర్టుగా ఉండేది. పాత విమానాశ్రయాన్నే తిరిగి అభివృద్ధి చేస్తున్నారు. దీని విస్తరణ, భూసేకరణ కోసం రూ. 205 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి నివేదిక అందించారు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే వరంగల్ ఎయిర్‌పోర్ట్ 2027 చివరికి అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రయాణికుల కోసం శంషాబాద్ విమానాశ్రయం ఒక్కటే అందుబాటులో ఉంది. ఇక బేగంపేటలో ఎయిర్‌పోర్ట్ ఉన్నా.. అది ప్రముఖుల వినియోగానికి మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల సంఖ్య పెంచాలని భావించిన రేవంత్ సర్కార్ కేంద్రానికి పలు ప్రతిపాదనలు పంపించింది. రామగుండం, కొత్తగూడెంలో విమానాశ్రయాల ఏర్పాటుకు ఉన్న మార్గాలను పరిశీలించాలని కోరింది.

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను!

## బీజేపీని బలోపేతం చేసి పవర్‌లోకి తీసుకొస్తా

- భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై కోర్టును ఆశ్రయిస్తా
- కన్వర్టెడ్ బీసీ పదాన్ని తెచ్చిన రేవంత్‌కు ప్రైజ్ ఇవ్వాలి
- హైడ్రాతో ఇండ్లు కూల్చినట్లు ప్రభుత్వం కూడా కూలుతుంది
- చిట్ చాట్‌లో టీ- బీజేపీ చీఫ్ రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని, రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసి అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనపై చేసిన వ్యాఖ్యలపై కోర్టుకి వెళ్తానని స్పష్టం చేశారు. భట్టిని బయటపెట్టేందుకు నోటీసులు ఇవ్వలేదని, పాపం ఆయన నా నోటీసులు పూర్తిగా చదవలేదు అనుకుంటానని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను బీజేపీ సీరియస్‌గా తీసుకుంటుందని, బై పోల్ టికెట్ కోసం చాలా మంది పోటీ పడుతున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలు కూడా బీజేపీనే కోరుకుంటున్నారని, ఉప ఎన్నికలో మంచి ఫలితం రాబోతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైడ్రాతో ఇల్లు కూల్చిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూలనుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రాకు పేదవాడి ఇల్లు కూల్చినప్పుడు కనిపించని మానవత్వం ఫాతిమా కాలేజీ దగ్గర గుర్తు వచ్చిందా..? అని ప్రశ్నించారు. హైడ్రా ఒక ఫెయిల్యూర్ వ్యవస్థ అని విమర్శించారు.

**రాహుల్ గాంధీ ఏంటని అడిగితే..**

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక హైడ్రా ఉంచాలా వద్దా అనేది ఆలోచిస్తామని రామచందర్ రావు కామెంట్స్ చేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ వ్యవహారం అధిష్టానం చూసుకుంటుందని, హైకమాండ్ పరిధిలో ఉన్న అంశంపై మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను చూశారని.. ఇప్పుడు బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తామన్నారు. ప్రధాని మోదీ బీసీ కాదంటూ బీసీ సమాజాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని అన్నారు. రాహుల్ గాంధీ ఏంటని తాము అడిగితే ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కన్వర్టెడ్ బీసీ అనే కొత్త పదాన్ని రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని, ఆయనకు గోబెల్స్ ప్రైజ్ ఇవ్వాలని వ్యాఖ్యానించారు. రాష్ట్ర బీజేపీ కమిటీలో 20 పోస్టులే ఉన్నాయని అన్నారు. 8 ఉపాధ్యక్షులు, 3 ప్రధాన కార్యదర్శులు, 7 కార్యదర్శులు, ఒక కోశాధికారి పోస్టు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ కుటుంబ పార్టీ అయినందున జంబో కమిటీ ఉంటుందన్నారు. గత ఐదేళ్లుగా తనకు పార్టీ పదవి లేదని.. ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడిని అయ్యానన్నారు.

# తెలంగాణ ఏర్పాటుకు సోనియా పోరాటం

## రాష్ట్ర ప్రజలతో కాంగ్రెస్ బంధం సుస్థిరం

### తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసింది: రాహుల్ గాంధీ



**ఢిల్లీ, మహా :** తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి సోనియా గాంధీ చేసిన పోరాటం.. రాష్ట్ర ప్రజలతో కాంగ్రెస్ బంధాన్ని సుస్థిరం చేసిందని రాహుల్ గాంధీ ఎక్స్ లో భావోద్వేకంగా పోస్టు చేశారు. తెలంగాణ ప్రజల భాష, సంస్కృతితో మా సంబంధాన్ని మరింత పటిష్టం చేసిందని పేర్కొన్నారు. సామాజికఆర్థిక కుల సర్వేను నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అద్భుతమైన ప్రయత్నాలను చూసినప్పుడు నేను అపారమైన గర్వంతో నిండిపోయాను. నిజాయితీగల, సమ్మిళితమైన, సంప్రదింపుల ప్రక్రియ పట్ల తెలంగాణ ప్రజల నిబద్ధత ఒక కొత్త ప్రమాణాన్ని నిర్దేశించిందని అన్నారు. ఇది దేశవ్యాప్తంగా భవిష్యత్ జనాభా లెక్కలకు మార్గనిర్దేశం చేయాలని, సర్వే ఆధారంగా, స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా సంస్థలలో 42శాతం ఓబీసీ రిజర్వేషన్లను సిఫార్సు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసిందని కొనియాడారు. ఈ బిల్లు ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి ఉంది. తెలంగాణ మోడల్ దార్శనికమైనది, సమ్మిళితమైనది, 21వ శతాబ్దపు డేటా ద్వారా ఆధారితమైనది. ఇది సామాజిక న్యాయంలో 2.0 అని భారతదేశం ఎలా ముందుకు సాగుతుందో నిర్వచిస్తుందని పేర్కొన్నారు.

# పాలన మరింత పరుగు

- ఉమ్మడి జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** పాలనను మరింతగా పరుగు పెట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయాలని స్పెషల్ ఆఫీసర్లను సర్కారు ఆదేశించినట్లు తెలుస్తోంది. కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించినట్లు సమాచారం. దాంతో పాటూ హైదరాబాద్ జిల్లా బాధ్యతలను జీహెచ్ఎంసీ మిషనర్ ఇలంబర్తికి అప్పగించారు.

**ఉమ్మడి జిల్లాలు - ప్రత్యేక అధికారులు వీరే**

- హైదరాబాద్ - ఇలంబర్తి
- రంగారెడ్డి - డి. దివ్య
- ఆదిలాబాద్ - సి. హరికిరణ్
- నల్గొండ - అనితా రామచంద్రన్
- నిజామాబాద్ - ఆర్. హనుమంతు
- మహబూబ్‌నగర్ - రవి
- కరీంనగర్ - సర్ఫరాజ్ అహ్మద్
- వరంగల్ - కె. శశాంక
- మెదక్ - ఎ. శరత్,
- ఖమ్మం - కె. సురేంద్ర మోహన్



# కాంగ్రెస్‌ది పనికి రాని సర్వే

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**ఢిల్లీ, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ పనికిరాని సర్వే చేసిందని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు . 75 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ ఏనాడు బీసీ జనగణన చేయలేదు. బీసీలను కాంగ్రెస్ మభ్యపెడుతోంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. బీసీని ప్రధానిని చేసిన ఘటన బీజేపీది అంటూ చెప్పుకొచ్చారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..'దేశానికి అత్యధిక కాలం పని చేసిన రెండో ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారు. బీసీలను కాంగ్రెస్ మభ్య పెడుతోంది. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం అమలు చేయడంలో ఫెయిల్ అయ్యింది. బీసీల్లో ముస్లింలను కలపడం వల్ల బీసీ వర్గాలకి అన్యాయం జరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ సీట్లలో ముస్లింలకు పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన 42 శాతం రిజర్వేషన్లలో పది శాతం ముస్లింలకు ఇవ్వడం వల్ల నిజమైన బీసీలకు నష్టం జరుగుతుంది. 75 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ ఏనాడు బీసీ జనగణన చేయలేదు. కాంగ్రెస్ పనికిరాని సర్వే చేసింది. బీసీలలో ముస్లింలను కలిపేలా కేంద్రం కుల గణన ఉండదు. బీసీలకు న్యాయం చేసేలా కుల గణన ఉంటుంది. కాంగ్రెస్ ఏనాడు బీసీ సీఎం, బీసీని ప్రధానిని చేయలేదు. బీసీని ప్రధానిని చేసిన చరిత్ర బీజేపీది. మోదీ కన్వర్టెడ్ బీసీ ఎలా అవుతారు?. కాంగ్రెస్ హయంలోనే మండల కమిషన్ ద్వారా మోదీ కులాన్ని బీసీల్లో చేర్చాలి. బీసీల్లో చేర్చినపుడు కనీసం మోదీ ఎమ్మెల్యే కూడా కాదు. రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక కులాలు బీసీల్లో కలిశాయి. లంబాడాలను కూడా కన్వర్టెడ్ ఎస్టీ అంటారా? అని ప్రశ్నించారు.




# హెచ్‌సీఏ ప్రధాన కార్యదర్శి దేవరాజ్ అరెస్టు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాల కేసులో సంస్థ ప్రధాన కార్యదర్శి దేవరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సీఐడీ అధికారులు అతడిని పుణేలో అదుపులోకి తీసుకున్నారు. హెచ్‌సీఏ అక్రమాల కేసులో దేవరాజ్ ఏ2గా ఉన్నారు. తాజా అరెస్టుతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య ఆరుకు చేరింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును పోలీసులు ఇదివరకే అరెస్టు చేశారు. నకిలీ పత్రాలను సమర్పించి ఆయన అధ్యక్ష పదవిని పొందినట్లు ఆరోపణలు రావడంతో అరెస్టు చేసినట్లు సీఐడీ అధికారులు పదిహేను రోజుల క్రితం వెల్లడించారు. ఆయనతో పాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. తాజాగా మరొకరిని అరెస్టు చేశారు.

# దంచికొట్టిన వాన

## ఉప్పొంగిన వాగులు, వంకలు

- పలుచోట్ల తెగిపోయిన రోడ్లు.. రాకపోకలకు అంతరాయం
- ఆసిఫాబాద్‌లో అత్యధికంగా 7.5 వర్షపాతం నమోదు
- రాష్ట్ర వ్యాప్తంగా మరో మూడ్రోజులు భారీ వర్షా లు



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ , మెదక్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల పరిధిలో జోరు వానలతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వాయువ్య బంగాళాఖాతంలో దానికి అనుకుని ఉన్న బెంగాల్ తీ ప్రాంతాలు, బంగ్లాదేశ్ ప్రాంతాల్లో వాయుగుండం ఏర్పడింది. గడిచిన 3 గంటల్లో 13 కి.మీ వేగంతో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి తీరాలను దాటినట్లు ఐఎండీ పేర్కొంది. మరోవైపు ఉత్తర ప్రదేశ్, ఈశాన్య మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్ ఘడ్, దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఒడిశా మీదుగా వాయుగుండం కేంద్రం వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కిమీ ఎత్తు వరకు ద్రోణి కొనసాగుతోందని వివరించింది. ఈ ప్రభావంతో మరికొన్ని రోజులు పలు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. వరంగల్, కరీంనగర్ వరద బీభత్సానికి అల్లాడాయి. వాగులు ఉప్పొంగగా, పలుచోట్ల రోడ్లు తెగిపోయాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏజెన్సీలో జనజీవనం స్తంభించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆ నీరు సక్రమంగా వెళ్లే డ్రైనేజ్ మార్గం లేక పోవడంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక హైటెక్ సిటీ, ఎంజే మార్కెట్, మాదాపూర్, ఉప్పల్, కుషాయిగూడ, ముషీరాబాద్, అమీర్‌పేట్, చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌షుఖ్‌నగర్, కొత్తపేట్, ఎల్బీ నగర్, హయత్ నగర్, సరూర్ నగర్, కోఠి, అబిడ్స్, బేగంబజార్, పాతబస్తీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

**మరో మూడ్రోజులు వర్షా లు..**

శనివారం (నేడు) రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్, వికారాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, వరంగల్, జనగాం, జయశంకర్, పెద్దపల్లి, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆసిఫాబాద్ జిల్లా రవీంద్రనగర్‌లో 7.5, కౌటాలలో 7.4, లోనవెల్లి 6.7 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది.

# ఈ-గవర్నెన్స్ చాలా కీలకం..

## హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌కు ఎస్తోనియా సహకారం తీసుకుంటాం

ఏఐ, వాణిజ్యం, సైబర్ సెక్యూరిటీలో కలిసి పని చేయాలి: శ్రీధర్ బాబు

మంత్రిని కలిసిన ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్



**హైదరాబాద్, మహా:** డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణలో గణనీయ అభివృద్ధి సాధించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈగవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన 'ఎస్తోనియా' సహకారం తీసుకుంటామని వెల్లడించారు. ఈ రెండు రంగాల్లో ఎస్తోనియా దేశం అగ్రగామిగా ఎదగడం అబ్బురపరుస్తోందని ఆయన ప్రశంసించారు. శుక్రవారం ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో సచివాలయంలో తనను కలిసిన వాణిజ్య ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. వీరిలో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఆరోగ్యరంగాల ప్రతినిధులున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్‌లో ఇంకా ప్రథమ దశలోనే ఉందని, వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా తమకు సాంకేతిక సహకారం అందించాలని శ్రీధర్ బాబు కోరారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికతలో కూడా కలిసి పనిచేయాలన్న ఆకాంక్షను ఆయన వెలిబుచ్చారు.

**మరింత పారదర్శకంగా..**

ప్రజా సేవల విభాగాలను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు ఈగవర్నెన్స్ కీలకమని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో ఎస్తోనియా తోడ్పాటును కోరుతున్నామని, సైబర్ సెక్యూరిటీలో కూడా పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు తమ శత్రుదేశానికి భారీ నష్టం కలిగించాయన్నారు. భవిష్యత్ యుద్ధం డ్రోన్లు, సైబర్ దాడులతోనే జరుగుతాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం ఉత్పత్తిలో ముందున్నామన్నారు.ఈ రంగాల్లో కూడా కలిసి పనిచేసే విషయాన్ని పరిశీలించాలన్నారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ చేసిన అభ్యర్థనకు శ్రీధర్ బాబు స్పందించారు. తమ ప్రభుత్వ అధికారుల బృందం వస్తుందని, విద్య, ఈ గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్ లో పరస్పరం సహకరించుకునే విషయంపై చర్చిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీ సేవ) కార్పొరేషన్ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ముష్కి చెరువును కాపాడే పనిలో హైడ్రా

## ఎఫ్‌టీఎల్‌లో పోసిన మట్టిని తొలగించాలని ఆదేశాలు



**హైదరాబాద్, మహా :** రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీలోని ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టిని వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. ఆగస్టు నెలాఖరుకు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టితో పాటు.. పై భాగంలో వేసిన బండ్‌ను తొలగించాలని.. లేని పక్షంలో బాధ్యులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అభివృద్ధి పేరిట చెరువు ఎఫ్‌టీఎల్‌లో బండ్ నిర్మించి.. పై భాగాన్ని చెరువు నుంచి బండ్ ద్వారా వేరు చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదుతో..హైడ్రా శుక్రవారం హైడ్రా కార్యాలయంలో విచారణ చేపట్టింది. సీ ఎస్ ఆర్ నిధుల కింద చెరువును అభివృద్ధి చేస్తున్న తత్వ రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు ఆ పనులు చేపట్టిన ద్రవాన్ష్ అనే ఎన్‌జీవో సంస్థ ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యమారు. చెరువు విస్తీర్ణం మొత్తం 50 ఎకరాల వరకూ ఉండగా.. చెరువు చుట్టూ ఎగువ భాగంలో కూడా బండ్ నిర్మించడంతో కేవలం 12 ఎకరాలకు పరిమితం చేసినట్టు అవుతోందని నివాసితులు, ముష్కి చెరువు పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రా ముందు వాపోయారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత అభివృద్ధి పనుల పేరిట నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులో మట్టి పోయడం పట్ల హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మట్టిని తొలగించి పూర్తి స్థాయిలో చెరువును కాపాడి అభివృద్ధి పనులు కొనసాగించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ద్విచక్ర వాహన దొంగలకు చెక్ పెడుతున్న ట్రాఫిక్ పోలీసులు

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమీషనర్ అఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు వారి వాహనాలు తనిఖీల్లో భాగంగా ఆంధ్రపదేశ్ రాష్ట్రం లో 2025 మార్చి నెలలో దొంగిలించబడిన AP40 D 0158 పల్సర్ NS 160 ద్విచక్రవాహనాన్ని సంబంధిత బాధితుడికి హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు అప్పగించారు. ఈ వాహనం నంబర్ ప్లేట్స్ తీసివేసి తిరుగుచుండగా హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ వారు వాహన తనిఖీలు నిర్వహించగా వాహనం నడుపుతున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారని అనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి తెలిపారు.

# తెలంగాణ హైకోర్టులో ఏపీ ఐఏఎస్‌కు చుక్కెదురు

## ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి పిటిషన్ కొట్టేసిన హైకోర్టు



**హైదరాబాద్, మహా :** ఓబులాపురం మైనింగ్ కేసులో (ఓఎంసీ) కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఐఏఎస్ శ్రీలక్ష్మి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. శుక్రవారం ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు శ్రీలక్ష్మి పిటిషన్ డిస్మిస్ చేసి తీర్పు రిజర్వ్ చేసింది. ఓఎంసీ మైనింగ్ లీజు వ్యవహారంలో 2006 లో శ్రీలక్ష్మి పరిశ్రమల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఓఎంసీ లీజు కట్టబెట్టే విషయంలో శ్రీలక్ష్మి అన్ని రకాలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీబీఐ పేర్కొంది. శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించక ముందే లీజ్ వ్యవహారం నడిచిందని శ్రీలక్ష్మి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ కేసులో ఏ 8 కృపానందం, ఏ 9 మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషిగా ప్రకటిస్తూ ఇది వరకే సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. తమ వాదనలతో పాటు, సీబీఐ జడ్జ్ మెంట్ ను కూడా పరిగణలోకి తీసుకోవాలని శ్రీలక్ష్మి న్యాయ స్థానాన్ని అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసింది హైకోర్టు. ఈ క్రమంలో హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా.. ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి గాలి జనార్దన్ రెడ్డికి జూన్ 11న షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది తెలంగాణ హైకోర్టు. సీబీఐ తీర్పుప్పై స్టే విధిస్తూ తీర్పు వెల్లడించింది కోర్టు. రూ. 10 లక్షల చొప్పున రెండు షూరిటీలు సమర్పించాలని ఆదేశించింది హైకోర్టు. పాస్ పోర్ట్ సరెండర్ చేయాలని.. ఇండియా విడిచి ఎక్కడికి వెళ్లొద్దని ఆదేశించింది కోర్టు.

# చేర్యాల బంద్ విజయవంతం సక్సెస్..

## రెండు నెలల ఉద్యమ కార్యచరణ ప్రకటించిన జేఏసీ

**చేర్యాల , మహా :** చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడం కోసం జేఏసీ నిర్వహించిన బందుతోనైనా ప్రజల ఆకాంక్ష ఇంత బలంగా ఉందో ప్రభుత్వానికి తెలిసి రావాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం జేఏసీ తలపెట్టిన బంద్ తో పట్టణంలో వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్చందంగా బందు పాటించాయి. చేర్యాల,మద్దూరు,కొమురవెల్లి, ధూల్మిట్ట మండల మండల కేంద్రాలతో పాటు మేజర్ గ్రామపంచాయతీలు సైతం ఉదయం నుండే జేఏసీ నాయకులు రోడ్డుపైకి వచ్చి పాదయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో నాటి పీసీసీ అధ్యక్షులు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చిన సందర్భంలో 18 నెలల కాలంలో వారి హామీని నెరవేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలు, వ్యాపార వాణిజ్య వర్గాలే నాయకులై స్వచ్ఛందంగా బందు చేశారని, ఇందుకు నిదర్శనమే రెవెన్యూ డివిజన్ ఆకాంక్ష ప్రజల్లో ఎంత ప్రభలంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఇది ఒక భౌతిక అంశం మాత్రమే కాకుండా ఈప్రాంత ప్రజల ఆకాంక్ష అస్తిత్వం, ఉనికి ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నదని ఈ బందు ద్వారా ప్రజల ఆకాంక్షను వెలిబుచ్చారు. ఇదే స్ఫూర్తితో రెవెన్యూ డివిజన్ సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు. వ్యాపార వాణిజ్య వర్గాలు ఇచ్చినటువంటి స్ఫూర్తితో ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామన్నారు. త్వరలో విద్యాసంస్థల బంద్, రహదారి దిగ్బంధం, చలో కలెక్టరేట్, వంటావార్పు తదితర అంశాలపై తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, పిల్లి చంద్రం, పోలోజు వెంకటాద్రి, ఎక్కలదేవి సుధాకర్, ఈరి భూమయ్య, సుతారి రమేష్, కత్తుల భాస్కర్ రెడ్డి,పొన్నబోయిన మమత,సనవాల HB పుల్లారెడ్డి, పొన్నబోయిన శ్రీనివాస్, కర్రె నర్సిరెడ్డి, భూర సీతారాములు, పుల్ల కుమార్, ముద్దల్ల యాదయ్య, కత్తుల లక్ష్మారెడ్డి, బింగి పోశయ్య, మురళి, మహేందర్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# కన్సల్టెన్సీలకు గుడ్ బై

## ఎన్నికల వ్యూహాల కోసం ఇకపై బయటి ఏజెన్సీలపై ఆధారపడం

రాజకీయ ఎత్తుగడలు, పైఎత్తుల విషయంలో మేం బలహీనమే: సజ్జల



**అమరావతి, మహా:** ఎన్నికల సమయంలో బయటి ఏజెన్సీలు, రాజకీయ వ్యూహకర్తలపై ఆధారపడటం సరైన పద్ధతి కాదని, భవిష్యత్తులో అలాంటి వాటికి తావుండదని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిఅన్నారు. ఇకపై పార్టీని క్షేత్రస్థాయి నుంచి సొంతంగా నిర్మించుకోవడంపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తామని శుక్రవారం తెలిపారు. సజ్జల మాట్లాడుతూ, "గతంలో ఎన్నికల సమయంలో టాస్క్ ఫోర్స్ లాగా బయటి సంస్థలపై ఆధారపడటం జరిగింది. అయితే ఇకపై వాటి అవసరం లేదు. మాకు ఇప్పుడు కావాల్సినంత సమయం ఉంది. గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టంగా నిర్మించుకుంటున్నాం. టెక్నాలజీని వాడుకుని, పార్టీ అధినేత సందేశాన్ని నేరుగా కార్యకర్తకు చేరవేసేలా కమ్యూనికేషన్ వ్యవస్థను రూపొందిస్తున్నాం," అని వివరించారు. ఏడాదిలోగా పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పాలనపైనే అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఎక్కువగా దృష్టి పెట్టడం వల్ల సంస్థాగత నిర్మాణంపై అనుకున్నంతగా దృష్టి పెట్టలేకపోయామని సజ్జల అంగీకరించారు. ఈ కారణంగానే ఎన్నికల సమయంలో బయటి సంస్థల అవసరం ఏర్పడిందని పరోక్షంగా తెలిపారు.

## నూతన సీడీపీఓలకు నియామక పత్రాలు

# అందజేసిన మంత్రి సీతక్క

## నూతన సీడీపీఓల్లో ఉత్సాహం.. తల్లిదండ్రుల్లో ఆనందం



**హైదరాబాద్, మహా :** మహిళా శిశు సంక్షేమ శాఖలో నూతనంగా ఎంపికైన 23 మంది సీడీపీవోలకు నియామక పత్రాలను మంత్రి సీతక్క అందచేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన సీడీపీవోలు సచివాలయంలో మంత్రి చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పండుగ వాతావరణం నెలకొంది. నూతన సీడీపీఓలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినందుకు మంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖకు సీడీపీఓలు వెన్నెముకలుగా పని చేస్తారని పేర్కొన్నారు."మీరు పొందిన ఈ ఉద్యోగం ఒక సామాజిక బాధ్యత. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మద్దతుగా నిలిచే సేవా విభాగంలోకి అడుగుపెడుతున్నారన్న విషయాన్ని మీరెప్పటికీ మరిచిపోవద్దు" అని మంత్రి తెలిపారు. "వేల మంది పోటీ పడిన ఈ పరీక్షలో మీరు మాత్రమే ఉద్యోగాలు పొందరు. ఈ విజయానికి మీరు చూపిన అంకితభావం ప్రధాన కారణం. మీరు నిర్వర్తించే విధుల్లో ఇదే అంకిత భావాన్ని కొనసాగించాలి" అని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు సేవలందించే అదృష్టం మీకు దక్కిందన్నారు. అంగన్వాడీల్లో పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ తో పాటు పాలు, గుడ్లను నిరంతరం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను ఆహ్లాద, ఆనంద కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. చిన్నారుల కోసం యూనిఫామ్స్ ను ఇవ్వడంతో పాటు 57 రకాల ఆటవస్తువులను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేశామన్నారు. అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడం, లబ్ధిదారులకు అన్ని హక్కులు కల్పించడమే ప్రధాన బాధ్యతగా సీడీపీఓలు పనిచేయాలన్నారు. కొత్తగా నియమితులైన అధికారులందరూ ఫీల్డ్ వర్క్‌ను ప్రాధాన్యంగా తీసుకుని, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యాలయాలకు పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వెళ్లాలని, ఏ విధమైన రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా స్వేచ్ఛగా పనిచేయాలని సూచించారు మంత్రి సీతక్క.

**సీడీపీఓల్లో ఉత్సాహం... తల్లిదండ్రుల్లో ఆనందం**

మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న సీడీపీఓలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ప్రజా ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఉద్యోగ నియామక చర్యల వల్లే ఈ అవకాశాన్ని పొందగలిగాం" అంటూ ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లలు ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు చేపడుతున్న దృష్ట్యా పలువురు తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. కూతుళ్లను ప్రభుత్వ ఉన్నతోద్యోగులుగా చూడాలన్న తమ కల నెరవేరిందని, ఇటువంటి ప్రజా ప్రభుత్వం పదికాలాల పాటు కొనసాగాలి అంటు ప్రభుత్వాన్ని ఆశీర్వదించారు. అంతకు ముందు మహిళా శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ జీ సృజన తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గోన్న ఈ సమావేశంలో అంగన్వాడీ సేవల పని తీరు మెరుగుదల, పోషకాహార లోప నివారణ కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనాల స్థానంలో ఈ ఏడాది వేయి నూతన అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. దేశంలో అంగన్వాడి సేవలను ప్రవేశపెట్టిన ఇందిరా గాంధీ జయంతి రోజైన నవంబర్ 19న నూతన అంగన్వాడి భవనాలను ప్రారంభిస్తామన్నారు. అప్పటి లోపు ఈ ఏడాది నిర్దేశించుకున్న వేయి అంగన్వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా అంగన్వాడి కేంద్రాలను దేశానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దే విధంగా పనిచేయాలని సూచించారు. వర్షాకాలం తో వచ్చే సీజనల్ సమస్యల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షంలో నానడం వల్ల అంగన్వాడి భవనాలలో పెచ్చులు ఊడే ప్రమాదం ఉందని, అటువంటి భవనాలను గుర్తించి తక్షణం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేని చోట ప్రైవేట్ భవనాల్లోకి అంగన్వాడీ కేంద్రాలను మార్చాలని సూచించారు. రాత్రి వేళల్లో తేళ్ళు, జె ర్రీలు వంటి విష పురుగులు అంగన్వాడి కేంద్రాల్లోకి వచ్చే ప్రమాదముందని, ఉదయం సిబ్బంది రాగానే పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కొంతమంది సిబ్బంది నిర్లక్షం వల్ల కొన్నిచోట్ల చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని...విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు అంగన్వాడి కేంద్రాలను విధిగా సందర్శించాలని, అంగన్వాడీల్లో హాజరు శాతాన్ని పెంచే చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఫీడింగ్, టీచింగ్, అటెండెన్స్ మీద యంత్రాంగమంతా సృష్టి సారించాలని కోరుకున్నారు.

EDITORIAL సంపాదకీయం

# భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు



స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ఇపుడు ప్రపంచమంతా చర్చ జరుగుతోంది. రెండు లేదా అంతకంటే ఎక్కువ దేశాలు ఈ ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. వస్తువులు, ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులపై కస్టమ్స్ సుంకాలను పూర్తిగా మినహాయించడం లేదా నిర్దిష్ట మొత్తంలో తగ్గించడం అనేది ఈ డీల్ లక్ష్యం. ఎఫ్‌టీఏ కుదుర్చుకునే దేశాలు, దీనిలోకి వీలైనన్ని ఎక్కువ వస్తువులు, ఉత్పత్తులను చేర్చేందుకు ప్రయత్నిస్తాయి. పరస్పర వాణిజ్యానికి ఎదురవుతున్న అవరోధాలను తొలగించేందుకు చర్యలను చేపడతారు. ఒప్పందంలో భాగమైన దేశాలు ఎగుమతి, దిగుమతులను పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇస్తాయి. ఈక్రమంలో ద్వైపాక్షిక పెట్టుబడులకు సైతం ప్రోత్సాహాన్ని కల్పిస్తాయి. 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం'లో దాదాపు 10 నుంచి 30 వాణిజ్యపరమైన అంశాలను కవర్ చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు, ప్రాంతీయ కూటముల మధ్య దాదాపు 350కిపైగా ఎఫ్‌టీఏలు అమల్లో ఉన్నాయి. ఇపుడు మోదీ స్వేచ్ఛా వాణిజ్య వ్యూహంతో కదులుతున్నారు. బ్రిటన్ పర్యటనలో భాగంగా ఆ దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత, ప్రధాని మోదీ, లండన్ నుంచి మాల్దీవులకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆ దేశంలో ల్యాండ్ అయిన ప్రధాని మోదీకి ఆదేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు, విదేశాంగ, రక్షణ, ఆర్థిక, హోంశాఖ మంత్రులు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. ఈ టూర్‌లో ప్రధాని మోదీ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరపనున్నారు. గతంలో భారత్‌మాల్దీవుల బంధం బలహీనపడింది. చైనా ప్రలోభాలకు లొంగిన మాల్దీవులు అప్పట్లో తన వైఖరి మార్చుకుంది. తమ దేశంలో ఉన్న భారత రక్షణబలగాలను ఖాళీ చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా భారత్‌తో కలిసి నిర్వహిస్తున్న ప్రాజెక్టులను నిలిపివేయాలని నిర్ణయించింది. భారత్‌తో వాగ్వాదం పెట్టుకుంది. దీంతో ఆగ్రహించిన భారతీయులు మాల్దీవులకు వెళ్లేందుకు నిరాకరించారు. లక్షద్వీప్ ను ప్రమోట్ చేశారు. దీంతో మాల్దీవుల టూరిజం భారీగా తగ్గిపోయింది. ఈ క్రమంతో తన నిర్ణయాల ప్రభావం ఎలా ఉందనేది మయిజ్జుకు త్వరగానే అర్థమైంది. దాంతో భారత్‌లో సంబంధాలను మెరుగు పర్చుకోవడానికి అతని ముందుకొచ్చారు. ఇందులో భాగంగానే గతేడాది భారత్ పర్యటనకు వచ్చిన మయిజ్జు.. మోదీని మాల్దీవుల పర్యటనకు ఆహ్వానించారు. ఇపుడు ప్రధాని మోదీ మాల్దీవులకు వెళ్లడంతో ఈ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

**భారత్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకున్న దేశాలు/కూటములు**

భారత్‌తో ఎఫ్‌టీఏ ఒప్పందాలు కుదుర్చుకున్న దేశాల జాబితాలో శ్రీలంక, నేపాల్, భూటాన్, థాయ్‌లాండ్, మారిషస్, చిలీ, ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, జపాన్, దక్షిణ కొరియా యూకే ఉన్నాయి. మన దేశంతో 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' కుదుర్చుకున్న ప్రాంతీయ కూటములలో ఈఎఫ్‌టీఏ (4 దేశాలు), ఆసియాన్ (10 దేశాలు), దక్షిణాసియా దేశాలు (6 దేశాలు), గ్లోబల్ సిస్టమ్ ఆఫ్ ట్రేడ్ ప్రిఫరెన్సెస్ (41 దేశాలు), సీఈపీఏ (3 దేశాలు), సీఈసీఏ (2 దేశాలు), సార్క్, మెర్కోసుర్ పీటీఏ, ఏపీటీఏ, ఈసీటీఏ ఉన్నాయి. 2014 నుంచి ఇప్పటివరకు భారత్‌తో ఎఫ్‌టీఏలు కుదుర్చుకున్న వాటిలో మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా, ఈఎఫ్‌టీఏ, యూకే ఉన్నాయి. అమెరికా, ఒమన్, యూరోపియన్ యూనియన్(ఈయూ), పెరూ, ఇజ్రాయెల్‌లతోనూ ఎఫ్‌టీఏలు కుదుర్చుకోవడానికి భారత్ ప్రస్తుతం చర్చలు జరుపుతోంది. గతంలో కెనడాతోనూ దీనిపై భారత్ చర్చలు జరిపింది. అయితే ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన గ్యాప్ రావడంతో ఆ చర్చలు ఆగిపోయాయి. ఇపుడు బ్రిటన్ తో పూర్తిచేసుకుని మాల్దీవులలో మోదీ అడుగుపెట్టారు.

# విశాఖ, విజయవాడలకు మెట్రో




రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మంకంగా మెట్రో రైలు ప్రాజెక్టులకు టెండర్ల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు శుక్రవారం టెండర్లు పిలిచింది. విశాఖపట్నంలో మెట్రో రైలు తొలి దశ కోసం ఈపీసీ ప్రాతిపదికన టెండర్లును ఏపీ మెట్రోరైల్ కార్పోరేషన్ పిలిచింది. ఈ మేరకు టెండర్ షెడ్యూల్‌ను మెట్రో రైల్ కార్పొరేషన్ విడుదల చేసింది. విశాఖలో 3 కారిడార్లలో 46.23 కిలోమీటర్ల మెట్రోకు టెండర్లు ఆహ్వానించింది. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34కి.మీ. మొదటి కారిడార్ చేపట్టనున్నారు. మూడు కారిడార్లలో 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు నిర్మించాలని టెండర్లలో తెలిపారు. మూడేళ్ల కాలపరిమితిలో మెట్రో రైలు ప్రాజెక్టును నిర్మాణం పూర్తి చేయాలని నిర్దేశించారు. మరో రెండు రోజుల్లో విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు తొలిదశ నిర్మాణానికి టెండర్లు పిలువనున్నారు. విశాఖ, విజయవాడ మెట్రోరైళ్ల నిర్మాణం, పర్యవేక్షణ, సాంకేతిక సహకారం కోసం సిస్టా, టిప్సా కన్సల్టెన్సీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

**రూ.11,498 కోట్లు అంచనాతో...**

రెండు మెట్రో రైల్ ప్రాజెక్టులకు కేంద్రం 20 శాతం, రాష్ట్రం 20శాతం, చొప్పున నిధులు కేటాయించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. మిగిలిన 60 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం పలు బ్యాంకులు ఫైనాన్స్ సంస్థల నుంచి అతి తక్కువ వడ్డీకి ఇప్పిస్తుందని అప్పుడు విడతల వారీగా మెట్రో రైలు కార్పోరేషన్ చెల్లిస్తుందని స్పష్టం చేశారు. రూ. 11,498 కోట్లు అంచనాతో విశాఖ మెట్రో రైలు నిర్మాణం చేస్తున్నామన్న మంత్రి రూ. 10,118 కోట్లు అంచనాతో విజయవాడ మెట్రో రైల్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టును ఫేజ్ 1లో 35.04 నిర్మాణం చేస్తామని తెలిపారు. మూడేళ్లలోనే విశాఖ, విజయవాడ మెట్రోరైళ్లు తొలిదశ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. విజయవాడ, విశాఖ మెట్రోలకు భూ సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని, విశాఖ మెట్రోకు 99.75 ఎకరాలు భూమి, విజయవాడ లో 91 ఎకరాలు భూమి కావాలని భూసేకరణకు నోటీసులు ఇచ్చామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

## శ్రావణ వాణి

# శ్రావణ దీప్తి-పుణ్య కీర్తి



శ్రావణ మాసం తెలుగు సంవత్సరంలో అత్యంత పవిత్రమైన మాసంగా పరిగణించబడుతుంది. ఈ నెలలో వర్షాలు ప్రారంభమవుతాయి. భూమి తల్లి సస్యశ్యామలం అవుతుంది. రైతుల పంటలు మొలకెత్తుతాయి. చెరువులు నిండుతాయి. పల్లెల్లో ఆవులు, ఎద్దులు నూతనోత్సాహంతో సంచరిస్తూ ఉంటాయి. ఈ నెలలో చేసే పుణ్యకార్యాలు ఎన్నో జన్మల పాపాలను కడుగుతాయని.పురాణాలు చెబుతున్నాయి.

**విశేషంగా ఈ నెలలో శివుని పూజ అత్యంత ప్రసిద్ధం**

ప్రతి వూళ్ళో ముత్తయిదువులు సాయంత్రం పూజలు,పేరంటాలు, నోములతో పులకరించిపోతుంటారు. . ఈ నెలలో వర్షపు చినుకులు భూమిని ముద్దాడుతూ ఉంటాయి. ఆ చినుకులలో ఆడుకుంటున్న పిల్లల ఆటలు చూడటానికి చాలా ఆనందంగా ఉంటుంది. మహిళలు ఈ నెలలో వివిధ వ్రతాలు చేస్తారు. ముఖ్యంగా సోమవారాలు ప్రత్యేకంగా జరుపుకుంటారు. శివునికి ఇష్టమైన బిల్వపత్రం తో పూజ చేస్తే పుణ్యం లభిస్తుందని నమ్మకం. ప్రాచీన గ్రంథాలు కూడా ఈ మాసాన్ని అత్యంత శుభమాసంగా పేర్కొన్నాయి. ఈ నెలలో పండుగల సందడి ప్రతి ఇంట్లో కనిపిస్తుంది. పొలాలపై పచ్చని దృశ్యం రైతుల హృదయాలను ఆనందంతో నింపుతుంది. ఇంతటి మాసం మన జీవితాలలో ఆధ్యాత్మికతను, ఆనందాన్ని నింపుతుంది. శ్రావణ మాసం వచ్చేసరికి ప్రకృతి సోయగం మనసును హరిస్తుంది. ఈ నెలలో వర్షాలు విరివిగా పడతాయి. భూమి సస్యశ్యామలమవుతుంది. పచ్చని పూలు, పచ్చని పొలాలు, పచ్చని చెట్లు మనసును ఆనందంతో నింపుతాయి. వర్షపు చినుకులు భూమిని తడిపి ప్రకృతి పరిమళాన్ని విస్తరిస్తాయి.

**పొలాల్లో రైతులు మొలకలుచూసి సంతోషపడతారు.**

గ్రామాల దగ్గర చెరువులు నిండిపోతాయి. నీటి తడిమనసు ప్రకృతి అందాన్ని పెంచుతుంది. గొర్రెల మందలు పచ్చిక పొలాల్లో తిరుగుతాయి. గోవులు పచ్చిక తింటూ సంతోషిస్తాయి. గొర్రెల కాపరులు వానలో వాయిద్యాలు వాయిస్తూ పల్లె సోయగాన్ని చూపిస్తారు. మహిళలు వానలో పాటలు పాడుతుంటే ఆ స్వరం ప్రకృతితో కలిసిపోతుంది. వానలో చినుకులు జల్లుతూ ఉండగా, పిల్లలు వానలో ఆడుతుంటారు. చెట్ల తడి వాసన, మట్టి సువాసన మనసును మంత్రముగ్ధం చేస్తుంది. కొండల మీద జలపాతాలు రూపుదిద్దుకుంటాయి. ఈ దృశ్యం చూసి కవులు కవితలు రాస్తారు. చెరువుల అంచున తామర పూలు పూసి ఆ అందాన్ని మరింత పెంచుతాయి. వానలో చినుకులు కురుస్తుంటే తోటలలో కొత్త కొత్త మొక్కలు మొలుస్తాయి. ప్రకృతి ఒక పండగ లాగా మారిపోతుంది. పూల వాసనలతో గాలి నిండిపోతుంది. శ్రావణ మాసంలో వర్షం వలన నదులు ఉప్పొంగుతాయి. ఆ ఉప్పొంగిన నీరు పొలాలకు ఆశీర్వాదం. గ్రామీణ కవులు ఈ మాసంలో పాటలు పాడతారు. శ్రావణం అనే పదం వింటే మనసు ఉప్పొంగుతుంది. "వర్షంలో పసుపు పూలు పూసినప్పుడు శ్రావణం వచ్చిందని తెలుసుకో" అని పెద్దవాళ్ళు అంటారు. ఈ మాసంలో వర్షం వలన వాయువులు చల్లబడతాయి. ఆ చల్లదనం మనసును హత్తుకుంటుంది. గడ్డి మీద జలబిందువులు ముత్యాల్లా కనిపిస్తాయి. అవి సూర్య కాంతిలో మెరిసిపోతాయి. ప్రకృతి మొత్తం కొత్త జీవం పొందుతుంది. ఈ అందాన్ని చూసి కవులు మంత్ర ముగ్ధులవుతారు.పల్లె వీధులలో వాన నీరు పారుతుంటే పిల్లలు కాగితపు పడవలు వదులుతారు. కాగితపు పడవలు ప్రవాహంలో పోతుంటే అందులో కలలు కంటారు. గ్రామాల్లో పెద్దవాళ్లు పాకల దగ్గర కూర్చొని పాత కథలు చెబుతారు. వర్షపు చినుకులు పైకప్పు మీద పడుతూ ఒక రాగాన్ని పాడతాయి. శ్రావణ మాసం వర్షాల తల్లి లాంటిది. పంటలకు, పశువులకు జీవం ఇచ్చేది. ప్రకృతికి స్నేహితురాలిగా ఈ మాసం ప్రతి మనసులో నిలుస్తుంది. ఇది కేవలం వర్షాల కాలం కాదు. ఇది జీవనానికి ఆరంభం!!




- శృంగేరి శారద
ఆధ్యాత్మిక రచయిత్రి

తరువాయి మరుసటి - సంచికలో

# వర్షా కాలంలో పిల్లల చర్మ సమస్యలు

## చర్మ నిపుణుల సలహాలు, నివారణ పద్ధతులు



వర్షాకాలం వచ్చిందంటే పెద్దవారికే కాదు, చిన్నారులకూ చర్మ సమస్యలు తప్పవు. ఈ వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. అది సూక్ష్మక్రిములకు, చికాకు కలిగించే పదార్థాలకు ఆవాసంగా మారి చర్మంలోకి సులువుగా చొచ్చుకుపోతుంది. ముఖ్యంగా పసిపిల్లల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది కాబట్టి, వారికి ఈ సమస్యలు మరింత ఎక్కువగా కనిపిస్తాయి. "మెడ, తొడల దగ్గర మొదలయ్యే తేమ త్వరగా ఎర్రగా మారి, దురద, వాపుకు దారితీస్తుంది. వీటిని పట్టించుకోకపోతే ఇన్ఫెక్షన్లుగా మారవచ్చు" అని బెంగళూరులోని అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు చెందిన చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ సఫియా తానీమ్ HT లైఫ్‌స్టైల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఈ తేమతో కూడిన వాతావరణం పసిపిల్లల చర్మాన్ని ఎలా దెబ్బతీస్తుందో ఆమె ఇంకా వివరించారు.

### వర్షా కాలంలో పిల్లలకు వచ్చే 5 చర్మ సమస్యలు:

**1. చెమటకాయలు:**

చెమట గ్రంధులు మూసుకుపోయినప్పుడు, చిన్న చిన్న ఎర్రటి దురద పొక్కులు లేదా దద్దుర్లు వస్తాయి. వీటిని ప్రిక్లీ హీట్ లేదా మిలియారియా అని కూడా అంటారు. ఇవి ఎక్కువగా వీపు, ఛాతీ వంటి ప్రదేశాలలో కనిపిస్తాయి.

**2. డైపర్ ర్యాష్:**

డైపర్‌ను ఎక్కువసేపు మార్చకుండా ఉంచడం వల్ల తేమ, రాపిడి పెరిగి, డైపర్ వేసిన చోట చికాకు, ఎరుపుదనం వస్తుంది.

**3. ఫంగల్ ఇన్ఫెక్షన్లు:**

అధిక వేడి, తేమ ఫంగస్ పెరగడానికి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఇది మీ బిడ్డ చర్మంపై దురద, ఎర్రటి మచ్చలకు కారణం కావచ్చు.

**4. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు:**

పిల్లలు చర్మాన్ని గోకడం వల్ల గాయాలై, బ్యాక్టీరియా చర్మంలోకి ప్రవేశించి బొబ్బలు లేదా పుండ్లు ఏర్పడవచ్చు.

**5. ఎగ్జిమా తీవ్రమవ్వడం:**

తేమతో కూడిన వాతావరణం ఎగ్జిమాను మరింత తీవ్రం చేస్తుంది. ఇది పసిపిల్లల చర్మాన్ని పొడిగా, దురదగా, మంటగా మారుస్తుంది.

**పసిపిల్లలలో దద్దుర్లు, ఇన్ఫెక్షన్లను నివారించడానికి చిట్కాలు**

మీ బిడ్డకు ఎప్పుడూ లేత రంగు, వదులుగా ఉండే, గాలి ఆడే కాటన్ దుస్తులు మాత్రమే వేయండి. స్నానం చేయించిన తర్వాత, ముఖ్యంగా చర్మం మడతలలో చెమట లేదా తేమ చేరే ప్రదేశాలలో, పూర్తిగా ఆరేలా తుడవండి. శిశువైద్యుడు లేదా చర్మవ్యాధుల నిపుణుడు సిఫార్సు చేసిన మాయిశ్చరైజర్‌లు, సున్నితమైన సబ్బు లేని క్లెన్సర్‌లను ఉపయోగించండి. డైపర్ ర్యాష్‌ను నివారించడానికి, వీలైనప్పుడల్లా బిడ్డను డైపర్ లేకుండా ఉంచండి. డైపర్‌లను క్రమం తప్పకుండా మార్చండి. బలమైన వాసనలు, రసాయనాలు ఉన్న డిటర్జెంట్‌లు శిశువు చర్మాన్ని చికాకు పెట్టవచ్చు. కాబట్టి, పిల్లల బట్టలు, తువ్వాళ్లు, పక్క దుస్తులను తేలికపాటి డిటర్జెంట్‌తో ఉతకండి. ఫంగస్ పెరగకుండా నివారించడానికి వాటిని పూర్తిగా ఆరేలా చూసుకోండి. వీలైతే ఎండలో ఆరవేయండి. పైన పేర్కొన్న ఏవైనా లక్షణాలు కొనసాగినా లేదా ఏవైనా అసాధారణ మార్పులు కనిపించినా, వెంటనే శిశువైద్యుడిని లేదా చర్మవ్యాధుల నిపుణుడిని సంప్రదించండి.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# డేంజర్ స్పాట్స్

## ప్రమాదకరంగా మూలమలుపులు.. కమ్ముకున్న ముళ్ల పొదలు





**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలంలోని పలు ప్రధాన రహదారులపై ఉన్న మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ముళ్ల పొదలురోడ్లకు ఇరువైపులా కమ్మేయడంతో వాహన దారులకు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో చాలా మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రాణాలు కొల్పోతున్నా పట్టించుకునే నాథుడే లేదని వాహన దారులు వాపోతున్నారు. ఆమనగల్లు మండలంలోని షాద్ నగర్ ప్రధాన రహ దారిపై చింతలపల్లి గ్రామ సమీపంలో, ఆమనగల్లు పట్టణ సమీపంలోని జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో మలుపు, మూర్తుజపల్లి గ్రామ సమీపంలోని మలుపు, సంకటోనీపల్లి,తలకొండపల్లి ఎక్రోస్డ్ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారుల గుండా నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, బస్సులు, కార్లు తిరుగుతు ఉంటాయి. ప్రధాన రహదారులు కావడంతో యు ఆకారంలో ఉన్న ఈ మలుపులు కొత్త వారికి తెలియక ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద సూచిక బోర్డు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంభదిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, వేగాన్ని నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

**జాతీయరహదారిపై డివైడర్ల ప్రక్కన ఎత్తుగా పెరిగిన చెట్లు**

హైదరాబాద్ నుండి శ్రీశైలం జాతీయ రహదారిపై ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన యూటర్న్‌లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.రోడ్డుకు ఇరువైపులా, డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. రోడ్లు విశాలంగా ఉండటంతో భారీ వాహనాలు సహా కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలు వేగంగా దూసుకెళుతున్నాయి.రోడ్డును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యమిచ్చిన అధికారులు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టలేదు. ఆ చర్యల్లో లోపాల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా మార్గాల్లో డివైడర్ల మధ్యలో మొక్కల్ని పెంచారు. ఈ మార్గాల్లో చాలా చోట్ల యూటర్న్‌లు ఉన్నాయి.ఎత్తుగా పెరిగిన చెట్ల కారణంగా ఒకవైపు నుంచి మరో వైపునకు మళ్లే వాహనాలు ఎదురుగా వచ్చే వాహన చోదకులకు కనిపించడం లేదు. దీంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. యూటర్న్‌ల వద్ద సూచిక బోర్డులు, విద్యుత్తు ట్రాఫిక్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు, బోర్డులు లేవు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు యూటర్న్ వద్ద మలుపు తిరిగే వాహనాల్ని గమనించకుండా ఢీ కొడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి .సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న యూటర్న్‌లను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వీలైనంత త్వరగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి:ఆచారి




**ఆమనగల్లు, మహా:** రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బిజెపి జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఆమనగల్లు మున్సిపాలిటీ, ఆమనగల్లు రూరల్ మండలం అధ్యక్షులు అధ్యక్షతన కర్నాటి విక్రమ్ రెడ్డి ఎర్రవోలు శ్రీనివాస్ ముదిరాజ్ల ఆధ్వర్యంలో . స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల నిర్వహించారు.ఈ సమావేశంలో జాతీయ బీసీ కమిషన్మా జీ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, గ్రామీణ ప్రాంత ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని,బిజెపి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపాలిటీ కౌన్సిలర్స్, వార్డు సభ్యుల, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ నుండి, జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బిజెపి కైవసం చేసుకోనెల కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, అసెంబ్లీ కో కన్వీనర్ గోరటి నర్సింహ, జిల్లా కౌన్సిల్ మెంబర్ చెక్కల లక్ష్మణ్, నాగర్కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ నేనావత్ రవి రాథోడ్, కల్వకుర్తి అసెంబ్లీ బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, మున్సిపాలిటీ కౌన్సిలర్ శ్రీశైలం యాదవ్, కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, జిల్లా బిసి మోర్చా నాయకుడు విష్ణు చారి, మేడిగడ్డ మాజీ సర్పంచ్ అమర్ సింగ్, మాజీ ఎంపీటీసీ సింగంపల్లి శ్రీను, జిల్లా కౌన్సిల్ మెంబర్ సింగం శీను, బిజెపి సీనియర్ నాయకులు భగవాన్ రెడ్డి, జాంతుక జనయ్య, లండన్ చంద్రయ్య, శ్రీనివాసు, లక్ష్మణ్ రావు, ముక్తాల వెంకటయ్య, సక్రు నాయక్, నందు రాథోడ్, జయరాం, నరేందర్ రాథోడ్, ప్రవీణ్ రెడ్డి సాయి బాబా, అశోక్ యాదవ్, వడ్డే రాజు, చెక్కల సాయి, వరికుప్పల శ్రీను, పకిర నాయక్,శివరాం, గోపాల్, మహేష్, కొమురయ్య, బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వాగులో డీసీఎం బోల్తా

**షాద్‌నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం తంగేళ్లపల్లి వాగులో పత్తి లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా పడింది. పత్తిలోడుతో కాటన్ మిల్లు కు వెళుతున్న డీసీఎం వ్యాను తంగేళ్లపల్లి గ్రామ శివారులోని వాగు వద్ద వేసిన మట్టిరోడ్డు ఇరుకుగా ఉండటంతో అదుపుతప్పి వాగులో డీసీఎం బోల్తా పడింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు నిండుగా ప్రవహిస్తుంది. గత కొన్ని ఏళ్లుగా వాగుపై వంతెన నిర్మాణాన్ని చేపట్టమని గ్రామస్తులు అధికారులను రాజకీయ నాయకులను ఎంతగా వేడుకొన్న ఇప్పటివరకు వాగుపై వంతెన నిర్మాణాన్ని చేపట్టకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆస్పత్రికి సరిపడా వైద్య సిబ్బంది ఉన్నారా? లేరా ?

### జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, సానిటేషన్ చేపట్టాలని, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కమ్యూనిటి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి సరిపడా వైద్య సిబ్బంది ఉన్నారా? లేరా ? అని అక్కడి మెడికల్ ఆఫీసర్ ను అడిగారు. సిబ్బంది అవసరమైతే తనకు తెలియజేయాలన్నారు. హాజరు పట్టిక ప్రకారం వైద్యాధికారి, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేరా అని పరిశీలించారు. సి.హెచ్.సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి మెడికల్ ఆఫీసర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు సరిపడా అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రికి రోజు ఎంతమంది అవుట్ పేషంట్, ఇన్ పేషెంట్లు వస్తుంటారని డాక్టర్ ను ప్రశ్నించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండ వారం రోజుల్లో చర్యలు తీసుకొని శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కమ్యూనిటి హెల్త్ సెంటర్లో డయాలసిస్ పేషంట్లకు అవసరమైన నీరు అందించుటకు ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి మెడికల్ ఆఫీసర్ తీసుకొని వచ్చారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ వారం రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం వైద్యం, విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టినందున ప్రభుత్వ అంచనాలకు తగిన విధంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సీ వైద్యాధికారి దుర్గలత, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల కోసం సీపీఐ రాజీలేని పోరాటాలు చేసింది

- పార్టీ మండల కార్యదర్శిగా కావలి సురేష్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) ఇబ్రహీంపట్నం మండల నూతన కార్యదర్శిగా కావలి సురేష్ ని పార్టీ మండల ఎన్నుకున్నారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలోని ఎన్ఆర్ గార్డెన్ లో సిపిఐ పార్టీ 11వ మండల మహాసభలు నిర్వహించారు. ఈ మేరకు జరిగిన నూతన మండల కమిటీ ఎన్నికలో మండల కార్యదర్శిగా కావలి సురేష్ ను మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కావలి సురేష్ మాట్లాడుతు... తనపై నమ్మకంతో మండల కార్యదర్శిగా ఎన్నుకున్న మండల కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. సిపిఐ పార్టీకి ఎంతో చరిత్ర ఉన్నదని, కమ్యూనిస్ట్ లు నిరంతరం పేద ప్రజలకోసం అహర్నిశలు పోరాడతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో భూమి కోసం కమ్యూనిస్ట్ లు చేసిన పోరాటం మార్వాలేనిది అని అన్నారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నో భూ పోరాటాలు చేసి నిరుపేదలకు భూములను, ఇంటి పట్టాలను పంచిన చరిత్ర ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సిపిఐ పార్టీ పోరాటం మరువలేనిది అని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పొత్తు ఉన్న ప్రజల కోసం పోరాటంలో రాజీ లేదని అన్నారు. పేద ప్రజలకు ఎ కష్టం వచ్చిన ముందుగా గుర్తుకు వచ్చేది కమ్యూనిస్టులే అని అన్నారు. పేదరిక నిర్మూలనకు, పేద వారికి భూమి, ఇంటి స్థలం కోసం సిపిఐ పార్టీ తరపున శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. రాబోయే సంస్థగథఎన్నికల్లో సిపిఐ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకోవటానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు కావలి నర్సింహా,ఏఐటీయూసీ నాయకులు ఒరిగంటి యాదయ్య, సిపిఐ నాయకులు నిలమ్మ, శివరాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు...

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

### హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్

**హన్మకొండ మహా;** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ,ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రసవాలను ఎక్కువ జరిగేలా,అలాగే సి సెక్షన్ లను తగ్గించేలా అవగాహన కలిపించడం తో పాటు తగిన చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు,బస్తీ దవాఖాన , ఆర్బీఎస్కె వైద్య అధికారులు,ఆరోగ్యశ్రీ,108 ,టీ హబ్,తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అ.అప్పయ్య జిల్లాలో నిర్వహించిన ఆరోగ్య కార్యక్రమాలపై ,సీజనల్ వ్యాధులపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్ బి ఎస్ కే బృందాలు ఏ విధంగా స్కూల్స్,అంగన్ వాడి కేంద్రాల్లో సేవలు అందిస్తున్నారు,ఏ విధమైన సమస్యలు గుర్తిస్తున్నారు.



### బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా:** సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. శుక్రవారం మండల పరిధిలోని హైదరాబాద్ లోని చౌదర్ పల్లి గ్రామానికి చెందిన జె. జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గృహంలోని నివాసంలో జె. జంగయ్య కు రూ,44 వేల రూపాయల చెక్కును బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధిని అందరు వినియోగించుకోవాలన్నారు. సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలోని మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎమిరెడ్డి భగవాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఎమిరెడ్డి రవికిరణ్ రెడ్డి,రేణు రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,రవీందర్,విజయ్ రాథోడ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

## పలు ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

### వంటగది క్లాస్ రూమ్ లను పరిశీలించిన జిల్లా విద్య అధికారి సుశిందర్ రావు



**రాజేంద్రనగర్, మహా ;** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలలోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ స్థాయి సమావేశాలలో భాగంగ శుక్రవారం రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు శంషాబాద్ మండలంలోని పలు శంషాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొండుపల్లి పాఠశాలలను ఆకస్మికంగా జిల్లా విద్యాధికారి సుశీందర్రావు పరిశీలించారు. పర్యటనలో భాగంగ విద్యార్థుల ఎఫ్ ఎల్ ఎన్ బేస్ లైన్ టెస్ట్ నిర్వహణ పైన ఉపాధ్యాయులను సమీక్షించారు. తదనంతరం ఒకటవ తరగతి నూతన విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన కార్యాచరణ విద్యప్రవేశ్ ఆవశ్యకత, దాని ప్రాధాన్యత గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రస్తుత పాఠశాలలో గ్రంథాలయ ప్రాధాన్యత, విద్యార్థులలో గ్రంథాలయాలు సంబంధిత కార్యక్రమాలు అమలు పైన ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఉపాధ్యాయులు విధిగా అన్ని పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలు ప్రజలలో తీసుకెళ్ళి ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి విద్యార్థితో ఒక మొక్కను నాటాలి, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలి, మేను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి , స్థలం ఉన్న పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సందర్శనలో భాగంగ మధ్యాన భోజన అమలును జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శంషాబాద్ లో పర్యవేక్షించారు. విద్యార్థుల క్లాస్ రూమ్ లతోపాటు వంటగదిలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం శంషాబాద్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసిన భవిత కేంద్రం లో విద్యార్థులకు అందిస్తున్న ఫిజియోథెరపీ చికిత్స ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, జిల్లా కమ్యూనిటీ కోఆర్డినేటర్ వెంకటేష్, రిసోర్స్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్కైన రాజేంద్రనగర్ డీసీ రవికుమార్



**రాజేంద్రనగర్, మహా :** రెండు లక్షల రూపాయల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన డిప్యూటీ కమిషనర్ రవి కుమార్. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్కైన డిప్యూటీ కమిషనర్ రవికుమార్. ఏసీబి అధికారులకు చుక్కలు చూపిస్తు తాను డబ్బులే తీసుకోలేదని సోదాలు చేసుకోమని చెప్పినా... చివరకు తన కారులోని బ్యాగులో రెండు లక్షల రూపాయల డబ్బులు దొరకడంతో అధికారులు ప్రశ్నిస్తున్నారు. పలు దస్తావేజులను, డిజిటల్ డేటా నగదు లావా దేవిలను పరిశీలిస్తున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారుల దాడులు నిర్వహించారు.

## పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు..!

### ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు సభావట్ భాస్కర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంతన్ గౌరెల్లి గ్రామంలో ఉన్న ప్రాథమికొన్నత పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడడంతో భయాందోళన గురవుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు.. యాచారం మండలం మంతన్ గౌరెల్లి గ్రామంలోని ప్రాథమికొన్నత ప్రభుత్వం పాఠశాలను ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల నాయకులు, శిథిలావస్థకు చేరిన పాఠశాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు సభావట్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ... గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, తరగతి గదులలో పైకప్పు పెచ్చులుడుతుందని అన్నారు. గ్రామంలో పాఠశాలను నిర్మించి దాదాపు 50 సంవత్సరాలు అవుతున్న, కొత్త భవనాన్ని నిర్మించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. శిధిలావస్థకు చేరిన తరగతి గదులను చూసి, విద్యార్థులు ఈ పాఠశాలలో ఎలా చదువుకుంటారని, ఏ విధంగా పిల్లలను పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులు భయంతో ఆందోళన పడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఇప్పుడు వర్షాకాలం కావడం తో వర్షాలు అధికంగా కురుస్తుండడంతో తరగతి గదులు ఎలాంటి పరిస్థితుల్లో కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొందని, విద్యార్థులు పాఠశాలలో భయంతో చదువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేద పిల్లలు ఉన్నారు. కానీ గత సంవత్సరం ఉన్న విద్యార్థుల సంఖ్య కంటే ఈ సంవత్సరము విద్యార్థుల సంఖ్య అధికంగా పెరిగినప్పటికీ, తరగతి గదులు శిథిలావస్థలో ఉండడం వల్ల, తల్లిదండ్రులు తమ పిల్లలను అప్పు చేసి మరి ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నారని అన్నారు. అదేవిధంగా వంటగది శిథిలావస్థకు చేరిందని అన్నారు. ఈ సమస్యలపై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం లేదని ఆందోళన చెందారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అధికారులు కొత్త భవనాన్ని నిర్మించి నిర్మించడానికి తక్షణమే నిధులను మంజూరు చేసి పాఠశాల తరగతి గదులను నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను విద్యార్థి తల్లిదండ్రులను కలుపుకొని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బట్టు జంగయ్య ,కే కుమార్ ఎస్ఎఫ్ఐ నాయకులు గోపాల్, డివైఎఫ్ఐ నాయకులు చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు



### స్థానిక నాయకులతో కలిసి ఆర్&బీ అధికారులు స్థల పరిశీలన

**షాద్‌నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ చటన్ పల్లి ఫ్లై ఓవర్ నిర్మాణ లను వై ఆకారంలో 184 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న స్థానిక నాయకులు ఆర్ఆర్ బి అధికారులు కొలతలను సుచించారు, ఈ సందర్భంగా 24 మీటర్ల రైల్వే అనుమతులు రావాలని పేర్కొన్నారు త్వరలో అనుమతి రాగానే పనులను ప్రారంభిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ ఆర్ బి ఏఈ రవీందర్, సందీప్ కుమార్ కాంట్రాక్టర్ టి వి రావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, సీనియర్ నాయకులు అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, రవి కుమార్,నీరటి వాసు, సందీప్ రెడ్డి, ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, శేఖర్,రవితేజ,రమేష్, రాజుల యదయ్య,మన్నే రవి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు..

## ఏసీబీ వలలో జిహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్

### రాజేంద్రనగర్ సర్కిల్లో విధులు

- ఐదు లక్షల లంచం డిమాండ్ చేసిన రవికుమార్
- 2 లక్షలు తీసుకుంటుండగా పట్టుబడ్డ డీసీ




**రాజేంద్రనగర్, మహా :** రెండు లక్షల రూపాయల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన, డిప్యూటీ కమిషనర్ రవి కుమార్. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఫిర్యాదుదారుడి నుంచి ఐదు లక్షలు డిమాండ్ చేసిన డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్, రెండు లక్షలు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు.

**చాకచక్యంగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

సోదాలు నిర్వహించడానికి వచ్చిన ఏసీబి అధికారులకు, తాను డబ్బులే తీసుకోలేదని సోదాలు చేసుకోమని దర్జాగా చెప్పిన డిసి... చివరకు తన కారులోని బ్యాగులో రెండు లక్షల రూపాయల డబ్బులు దొరకడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. ఎంతో పకడ్బందీగా ఏసీబీ అధికారులకు దొరకకుండా చాకచక్యంగా వ్యవహరించినా, అధికారులు మాత్రం డిసి తీసుకున్న లంచం డబ్బులను తన కారులో ఉన్నట్లు గుర్తించిన అధికారులు, డిప్యూటీ కమిషనర్ రవికుమార్ పై ప్రశ్నల వర్షం కురిపించారు. పలు దస్తావేజులను, డిజిటల్ డేటా, నగదు, లావాదేవిలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. అవినీతికి పాల్పడ్డట్టు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి డిసిని అదుపులోకి తీసుకున్నారు.. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారుల దాడులు నిర్వహించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం




**షాద్‌నగర్, మహా:** సర్పంచ్, ఎంపీటీసీ , జెడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో మన సత్తా చాటాలని, అభ్యర్థుల గెలుపు కోసం ఐకమత్యంతో పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం ఫరూఖ్ నగర్ మండలం హాజిపల్లి గ్రామంలోని ఎ.వి కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, అందుకు పార్టీ క్యాడర్ సిద్ధంగా ఉండాలని కోరారు. ఇప్పటి నుంచే గెలుపు కోసం తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, అభ్యర్థుల గెలుపులో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం ఉండాలని కోరారు. కెసిఆర్ హయాంలో రాష్ట్రంలో కొనసాగిన సంక్షేమ పథకాలపై, వాటి ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరపాలని పిలుపునిచ్చారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి కెసిఆర్ కిట్లు, రెండువేల పింఛన్లు, దళిత బంధు, బీసీ బంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, గురుకుల పాఠశాలలో ఏర్పాటు, నూతన గ్రామపంచాయతీలో ఏర్పాటు, పల్లె ప్రగతి ద్వారా గ్రామాల నిర్వహణ వంటి కార్యక్రమాల పైన ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిపి, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును పోలుస్తూ ప్రజలకు వివరంగా చెప్పాలని కోరారు. అధికారంలో లేకపోయినా గ్రామీణ ప్రాంతాలలో పార్టీ క్యాడర్ చెదిరిపోలేదని, మన పార్టీపై, పార్టీ అధినేత కేసీఆర్ పై గట్టి నమ్మకం ఉందనే విషయం మనకు తెలుస్తుందని, ప్రజలు సైతం కేసీఆర్ ను మరువలేకపోతున్నారని గుర్తు చేశారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నన్ని రోజులు తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందాయని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను మరోమారు చేయొద్దని, గెలుపు కోసం శత విధాలుగా ప్రయత్నించి పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా పనిచేయవలసిన అవసరం ఉందని, అందుకు చిన్న కార్యకర్త తో పాటు పెద్ద నాయకుల వరకు సహకరించాలని కోరారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై పలువురు నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోసపూరిత ప్రకటనలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అట్టర్ ఫ్లాప్ అయిందని, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక చేతులెత్తేసిందని వండిపడ్డారు. నియోజకవర్గంలో సైతం నిరంకుశ తత్వ పాలన కొనసాగుతుందని, ఓ పాఠశాలలో పుస్తకాలను పంచుతామంటే కూడా పంచనివ్వని దృష్టికి చేరుకుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు నిధులు, రైతు రుణమాఫీ నిధులు అర్హత కలిగిన రైతులకు సైతం ఇవ్వలేదని ఘోరాతీ ఘోరంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని వాపోయారు. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి చేతులెత్తేసిందని, మహిళలకు 2500 పింఛను ఊసే లేదని, 4000 పింఛన్ల పెంపు పై ఇప్పటికి స్పష్టత లేదని వాపోయారు.

మహా పత్రిక
ANN తెలుగు
శనివారం, హైదరాబాద్ | 26-07-2025 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM


# మరో 48 గంటలు భారీ వర్షాలు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున, ఇంకా 48 గంటలు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపిన సమాచారం మేరకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సీ. నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరదలు సంభవించినప్పుడు, ప్రజలకు సహాయ, సహకారాలు అందించడానికి కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో, బాధితులు సహాయం కోసం ఈ టోల్ ఫ్రీ నంబర్: 04023237416 కు కాల్ చేయవచ్చని, వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించి సహాయం అందిస్తుందని కలెక్టర్ నారాయణరెడ్డి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 24 గంటలు పనిచేస్తుందని ఆయన అన్నారు.

**ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి....**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావడానికి, వృద్ధులు, పిల్లల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కురుస్తున్న వర్షాల కారణంగా ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తాచెదారని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని, ఇలా చేయడం వల్ల విష జ్వరాలు ప్రబలకుండా ఉంటాయని ఆయన ప్రజలకు సూచించారు.

# యూటర్న్ ఏర్పాటు చేయండి

## రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు వినతి



**రాజేంద్రనగర్, మహా ;** రోడ్డులో ఉన్న యూటర్న్ పాయింట్లను అలాగే ఉంచడం లేదా ప్రత్యామ్నాయంగా సోలిటరీ స్కూల్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్, బృందావన కాలనీ, టాటానగర్ బస్తీల ప్రజలు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రోడ్డులో నిర్మిస్తున్న ఎత్తైన డివైడర్ నిర్మాణంలో భాగంగా రోడ్డు ఏర్పడిన నాటి నుంచి ఉన్న మార్కండేయ నగర్ యూటర్న్, బాబుల్ రెడ్డి నగర్ యూటర్న్ పూర్తిగా మూసివేస్తూ నిర్మాణాలు చేస్తున్నారని, దీనివల్ల దాదాపు కిలోమీటర్ ముందుకు వెళ్లి దుర్గా నగర్ వద్ద యూటర్న్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల వినతితో యూటర్న్ సమస్యను పరిష్కరించేందుకు సోలిటరీ స్కూల్ వద్ద యూటర్న్ వదులుతామని మొదట ట్రాఫిక్ పోలీసులు తెలిపారని, ఇపుడు నిర్మాణ కాంట్రాక్టర్ యూటర్న్ కోసం వదిలిన ప్రాంతాన్ని కూడా డివైడర్ నిర్మాణంలో భాగంగా పనులు చేస్తున్నారని, వెంటనే యూటర్న్ ఏర్పాటు చేయించాలని స్థానికులు సోమ శ్రీనివాస్, జగన్,కిషోర్. రవి ముదిరాజ్ సోమ సందీప్. అశోక్ కుమార్, సురేష్, రమేష్, నాగరాజు, శంకర్, దినేష్, నవీన్ సన్నీ, లింగంలు విజ్ఞప్తిచేశారు.

# గ్రామమంతా ఏకమై శబరిమాత వేడుక



**తలమడుగు మహా:** ఆధ్యాత్మిక మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో శ్రావణమాసం ప్రారంభమైన సందర్భంగా శ్రీ సద్గురు శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమాన్ని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్నలు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించడం జరిగింది.వారు మాట్లాడుతూ గ్రామస్తులంతా ఏకమై ఈ నెలరోజుల పాటు అఖండ జ్యోతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేయడం అనేది ఎంతో అభినందించేదగ్గ విషయమని ఈ కాలంలో గ్రామమంతా ఒక్కటిగా పనులన్నీ వదులుకొని భక్తిశ్రద్ధలతో నెల రోజులపాటు ఈ అఖండ జ్యోతి కార్యక్రమాలు చేయడం వల్ల గ్రామానికి ఆ ప్రజలకు ఈ శబరీ మాతమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా లభిస్తూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కిరణ్ కుమార్, కేదారేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగన్న, అభిరామ్ రెడ్డి, గంగాధర్, రవికాంత్ యాదవ్, రమాకాంత్ గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# టైగర్ కారిడార్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

## మాజీ ఎంపీ సోయం బాపురావు



**ఆదిలాబాద్, మహా:** ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించేందుకు కేంద్రం టైగర్ కారిడార్ ల పేరిట జీవో 49 ను అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని, దీని కారణంగా దాదాపు లక్ష మంది ఆదివాసీలు నిరాశ్రయులు అయ్యే ప్రమాదం ఉన్నందున వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని పలు విషయాలను వెల్లడించారు. గతంలో గల్లీ నుండి ఢిల్లీ స్థాయికి తుడుం దెబ్బను తీసుకెళ్ళామని, ప్రస్తుత నేతల తీరుతో సంఘం పూర్తిగా విశ్వాసం కోల్పోయిందని ఆక్షేపించారు. కొందరు నేతలు డబ్బులు తీసుకుని తనపై ఆరోపణలు చేశారని ఆరోపించారు. ప్రజలంతా నూతన నాయకత్వం కోరడంతో రాజ్ గోండ్ సేవా సమితిలో చేరడం జరిగిందని తెలిపారు. ఈనెల 27న రాష్ట్ర అధ్యక్షులుగా తాను ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో చేపట్టనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాజ్ గోండ్ సేవా సమితి ద్వారా చేపట్టిన ఉద్యమాలు, కాంగ్రెస్ జిల్లా నేతల చొరవతో జీవో 49 రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ నేతలు సైతం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి జీవో అమలుపై నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చూడాలన్నారు. రాజకీయ స్వలాభం కోసం బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

# ఎస్బీఐ బ్యాంకు చుట్టూ ఆక్రమణలు తొలగింపు



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖ చుట్టూ స్థలంలో ఇటీవల ఆక్రమణలు తొలగించిన నేపథ్యంలో కార్యాలయం చుట్టూ కంచే వేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇటీవల పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో ఆక్రమణలు తొలగించిన నేపథ్యంలో బ్యాంకు కార్యాలయం చుట్టూ ఉన్న దుకాణాలను సైతం తొలగించారు. బ్యాంకుకు వచ్చే వినియోగదారులకు దుకాణాలతో ఇబ్బంది ఎదురవుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా... ఆక్రమణల తొలగింపు పూర్తయింది. ఆర్.బీ.ఐ పరిధిలో ఉన్న స్థలంలో మొక్కు పెంచాలన్న ఉద్దేశంతో కంచే వేసేలా బ్యాంకు అధికారులు ప్రణాళికలు రూపొందించగా.... కలెక్టర్ సూచనల మేరకు పురపాలక యంత్రాంగాన్ని సంప్రదించారు. అక్కడికి చేరుకున్న టీ.పీ.వో సుమలత మున్సిపల్ కమీషనర్ తో చర్చించి త్వరలోనే కంచే విషయమై నిర్ణయం తీసుకుంటామని, అప్పటివరకు కంచే వేయకుండా ఉండాలని సూచించారు. అదేవిధంగా బ్యాంకు చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేయవద్దని వీధి వ్యాపారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ఆర్.ఎం రామచంద్ర రావు మాట్లాడుతూ ఆర్బీఐ పరిధిలో ఉన్న స్థలంలో మాంసం దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో బ్యాంకుకు వచ్చే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని, విషయాన్నీ కలెక్టర్ దృష్టికి తీసుకెల్లడంతో తగు సూచనలు చేశారన్నారు. పుర అధికారుల సూచనల మేరకు ప్రస్తుతం కంచే వేయడం లేదని, వీధి వ్యాపారాలు సైతం వినియోగదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి దుకాణాలు ఏర్పాటు చేయవద్దని అన్నారు

# వరంగల్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా చూడాలి

## జిల్లాస్థాయి అధికారులతో సమన్వయ సమావేశం.. కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** మత్తు పదార్థాలను నివారించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి వరంగల్ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలిసి జిల్లా స్థాయి నార్కోటిక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నియంత్రణ, నషా ముక్త భారత్ లో భాగంగా చేపడుతున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. పోలీస్, విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ముఖ్యంగా యువతలో చైతన్యం తేవాలన్నారు. డి అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు గంజాయి వినియోగించకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈ సమీక్షలో జెడ్పి సీఈవో రామిరెడ్డి, డిఇఓ జ్ఞానేశ్వర్, డి డబ్ల్యు ఓ రాజమణి, డిఎం హెచ్ ఓ సాంబశివరావు , పోలీసు, నార్కోటిక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సంకల్ప్ ల్యాబ్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

విద్యార్థులు విద్యా విధానం ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శుక్రవారం మామునూర్ పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో పీఎం శ్రీ నిధి ద్వారా 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కృత్రిమ మేధో ఆధునిక సాంకేతిక నైపుణ్యాభివృద్ధి (సంకల్ప్) ల్యాబ్ ను కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యాలయానికి ముఖ్య అతిథిగా చేరుకున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారదను ప్రిన్సిపల్ పూర్ణిమ, ఎన్సిసి స్కౌట్ గైడ్ విద్యార్థినీ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని అందించేందుకు ప్రత్యేకమైన ప్రయోగశాలను పీఎం శ్రీ పాఠశాలల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ల్యాబ్ లో విద్యార్థులు రోబోటిక్స్ ఐ ఓ టి, బేసిక్ ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రెన్యువల్ ఎనర్జీ సిస్టం వంటి అంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకోవాలని కోరారు. కలెక్టర్ విద్యార్థులతో స్వయంగా సంభాషించి ఇష్టపూర్వకంగా చదివి భావిభారత పౌరులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఏక్ పేడ్ మాకే నామ్ లో భాగంగా విద్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పూర్ణిమ, సురేష్ రామలింగయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- అమ్మవారిని దర్శించుకున్న ములుగు జిల్లా కలెక్టర్
- ఆలయ ఈవో శేషుభారతి

**వరంగల్ మహా;** శ్రావణ మాసంలోని మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం పోసి అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఉదయం నుండి అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, మంచినీరు, ప్రసాద వితరణ ఏర్పాట్లు దేవాలయ చైర్మన్ డాక్టర్ బి శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు, తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, గాండ్ల స్రవంతి, ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగల ఆంజనేయులు, బింగి సతీష్ లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఐ.ఏ.ఎస్ కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన కలెక్టర్ కు ఆలయ ధర్మకర్తలు ఘనస్వాగతం పలికారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషు వస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి/సహాయ కమీషనర్ కె శేషు భారతి తెలిపారు.

# వరంగల్ లో భారీ మొత్తంలో గంజాయి పట్టివేత



**వరంగల్ మహా ;** వరంగల్ నార్కోటిక్స్ పోలీసులు గంజాయి అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపుతున్న క్రమంలోనే శుక్రవారం భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో చేపట్టిన మెరుపుదాడిలో రూ. 25.54 లక్షల విలువైన 51.081 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దందాలో కీలక పాత్ర పోషించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ గంజాయి నెట్‌వర్క్‌కు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తి మాత్రం ఇంకా పోలీసులకు చిక్కలేదు.

**పక్కా ప్లానింగ్ తో పట్టుకున్న నార్కోటిక్ పోలీసులు..**

నార్కోటిక్స్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, నగరంలోకి పెద్ద మొత్తంలో గంజాయి రవాణా అవుతుందని తెలిసింది. దీంతో జూలై 24న నర్సంపేట రోడ్డు, వరంగల్ వద్ద పోలీసులు వ్యూహాత్మకంగా మాటువేశారు. వారి అంచనా ప్రకారమే, నంబర్ ప్లేట్ లేని ఓ పల్సర్ బైక్ పై ఇద్దరు వ్యక్తులు రెండు పెద్ద సంచుల్లో గంజాయిని తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారిని పట్టుకున్నారు. నిందితుల నుంచి గంజాయితో పాటు, అక్రమ రవాణాకు ఉపయోగించిన నంబర్ లేని పల్సర్ బైక్, అలాగే నేర కార్యకలాపాలకు వాడిన రెండు సెల్ ఫోన్ల ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తున్న వరంగల్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సైదులు మాట్లాడుతూ ఈ దందాకు ప్రధాన మూలం అయిన 'పండు' అనే వ్యక్తి ఇంకా పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. త్వరలోనే అతడిని కూడా అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. వరంగల్ నగరంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు కంకణ బద్ధులై ఉన్నారని, యువతను ఈ వ్యసనాల బారి నుండి రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# దివ్యాంగులకు వైకల్యం ప్రతిభలో అడ్డు కాదు : కలెక్టర్



**భూపాలపల్లి, మహా :** అధికారులు దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారత విభాగం ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్ 2025 ను సుభాష్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రప్రభుత్వ నిధులు, పథకాల ద్వారా వారి ప్రతిభకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించాలని అన్నారు. మొట్ట మొదటి సారిగా మన జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందించారు. దివ్యాన్ గుల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇదొక మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల పథకాలు ప్రతి మారుమూల గ్రామ స్థాయికి చేర్చాలని, దివ్యాంగులను గుర్తించి వారి ప్రతిభ ఆధారంగా అవకాశాలు కపిస్తే వైకల్యం తమ ప్రతిభకు అడ్డు కాదని నిరూపిస్తారని తెలిపారు. అధికారులు దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించి, వారి నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా దృష్టి పెట్టాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం సంక్షేమ శాఖ బాధ్యతని, సంక్షేమం, సౌకర్యాలు కల్పనకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. దివ్యాంగులకు పాఠశాలల్లో విద్యాభ్యాసం, వృత్తి నైపుణ్యం, భవిత కేంద్రాలు నిర్వహణ, వారికి అవసరమైన పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. నేను మీకు అభయం ఇస్తున్నాను దివ్యాంగులకు వర్తించే అన్ని పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల సమన్వయంతో అభివృద్ధి లో దివ్యాంగులను భాగస్వాములను చేస్తూ చేయూతను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బుద్ధిమాంద్యంతో బాధపడే దివ్యాంగుల సాధికారత కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసేబులిటీఎస్ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18 ఎన్‌జీవోల స్టాళ్లు ఏర్పాటు చేయగా, వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. యూత్ ఫర్ జాబ్స్ సంస్థ ఉద్యోగ మేళా కోసం స్టాల్ ఏర్పాటు చేసింది. అలీం కో, ఐజినిష్ట్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్టాళ్లు పరిశీలించి దివ్యాంగులతో ప్రత్యేకంగా ముఖాముఖీ మాట్లాడారు. అన్ని స్టాళ్లను సందర్శించి, దివ్యాంగులు వేసిన పెయింటింగ్ కొనుగోలు చేసి నగదు చెల్లించి అభినందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులుప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో 600 కంటే ఎక్కువ దివ్యాంగులు, 300 IERPs, ఎన్‌జీవోలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారులు నిరుపేదలకు అండగా నిలవాలి


## ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలను పెంపొందించాలి

## పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** ప్రజలకు నిజాయితీతో సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన శివ కుమార్, వి. నర్సయ్య, వి. చంద్రమౌళి, ఆర్. ఎస్. శర్మ, సాంబయ్యలు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కు పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాల పై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ప్రజలకు పోలీసుల పట్ల భరోసా నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పదోన్నతి పొందిన ఎస్ఐలకు సూచించారు.

# పోచమ్మ బోనాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరించిన కార్పొరేటర్



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 27వ డివిజన్ లోని శ్రీ పోచమ్మ దేవాలయం స్టేషన్ రోడ్డు, తో పాటు అబ్బానికుంట నల్ల పోచమ్మ ఆలయాల్లో ఈనెల 30వ తేదీ బుధవారం కుమ్మరి కులస్తులచే తొలి బోనం సమర్పించనున్నారు. ఈ బోనాల ఉత్సవాల ఆహ్వానిక పత్రికను స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించి, పిసిసి కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ లకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎంతో వైభవంగా నిర్వహించుకునే శ్రావణమాస బోనాలను పురస్కరించుకుని అన్ని దేవాలయాలకు మంత్రి కొండ సురేఖ ఆదేశానుసారం కార్పొరేషన్ వారు ప్రతి దేవాలయం కు రంగులు వేయించడం, విద్యుత్ దీపాలను అలంకరించడం తోపాటు నీటి సౌకర్యం, క్యూలైన్లు, నిర్మాణ మరమ్మతులు చేయించడం పూర్తయిందని ఆలయాలకు శోభ తెచ్చే విధంగా మంత్రి కొండ సురేఖ ప్రత్యేక చొరవ తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కంటే ముందస్తుగా అన్ని పనులు చేయిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి చరణ్, ఓరుగంటి చిరంజీవి, ఓరుగంటి కుమార్ , ఉపేందర్, వీరలక్ష్మి, మల్లికార్జున్, సాగర్, బజరంగ్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**వరంగల్ మహా;** వరంగల్ నగరం బట్టల బజార్ లోని ప్రాచీన ప్రసిద్ధిగాంచిన బాలానగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో 26 జూలై 2025 శనివారం నుండి తేదీ 28 సోమవారం వరకు అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందరికీ అందేలా చేయాలని కోరుతూ పత్రికా సమావేశం ద్వారా తెలుపుతున్నాము. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త పరాశరం శ్రీనివాసచార్యులు, కార్యనిర్వాహణాధికారి ఇలపాటి రత్నాకర్ రెడ్డి, మాజీ ధర్మకర్తలు తో పాటు అర్చకులు ఉద్యోగులు పాల్గొన్నారు.


# గొంతెమ్మ గుట్టకు పర్యాటకులు వచ్చేలా అభివృద్ధి డిఎఫ్ఓ నవీన్ రెడ్డి



**కాటారం, మహా :** కాటారం మండలంలోని ప్రతాపగిరి పంచాయతీ పరిధిలోగల గొంతెమ్మ గుట్టకు పర్యాటకులు వచ్చేలా సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తామని భూపాలపల్లి జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వర్షం ను లెక్కచేయకుండా మద్రిపెల్లి నుండి గొంతెమ్మ గుట్టకు అటవీశాఖ ఉద్యోగులతో కలిసి కాలినడకన వెళ్లారు. రాబోయే గొంతెమ్మ గుట్ట జాతర వరకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ఏమేం అభివృద్ధి పనులు చేయాలో అధికారులతో కలిసి చర్చించారు. మద్రిపెల్లి గ్రామం నుండి గొంతెమ్మ గుట్ట పై వరకు భక్తులు సౌకర్యంగా నడిచి వెళ్లేలా మెట్ల నిర్మాణం చేపడుతారు. చిన్న వాగులపై పైపులతో కల్వర్టు ల నిర్మాణం, సోలార్ సిస్టం బోరువెల్ వేసి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎఫ్ డీ ఓ సందీప్ రెడ్డి , ఎఫ్ ఆర్ ఓ స్వాతి, డి ఆర్ ఓ సురేందర్ నాయక్, ఎఫ్ బి ఓ రాజేందర్, ఎఫ్ ఎస్ ఓ లు చంద్రశేఖర్, అర్చన , ఎఫ్ బి ఓ లు సంజీవ్, మోయినొద్దీన్, అశోక్,అధికారులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆరోపణలు ఖండిస్తున్నాం

- టీయూడబ్ల్యూజే యూనియన్ పై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు
- పాత్రికేయ వృత్తిలో అనర్హుల వల్లే అపకీర్తి వస్తుంది
- టియుడబ్ల్యూజే మంచిర్యాల జిల్లా అధ్యక్షులు డేగ సత్యం



**మంచిర్యాల, మహా:** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అసత్య ఆరోపణలను ఖండిస్తున్నామని మంచిర్యాల జిల్లా టి.యు.డబ్ల్యూ.జే (ఐ.జే.యు) అనుబంధం అధ్యక్షులు డేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగళి సంపత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గం సభ్యులు ప్రకాష్ రెడ్డిలు వాక్యానించారు. శుక్రవారం ఆ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం మందమర్రి ఏరియా సింగరేణి సి ఈ ఆర్ క్లబ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కమిటీ మెజారిటీ సభ్యుల ప్రతిపాదనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. కొంతమంది టియూడబ్ల్యూజే యూనియన్ ను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అలాంటి వాటిని మన యూనియన్ వివిధ మండలాలలో ఉన్న ప్రతినిధుల బృందం తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఇకనుండి మన యూనియన్ ను కానీ అలాగే మన నాయకత్వాన్ని కానీ ఎవరైనా సోషల్ మీడియాలో విమర్శలు చేస్తే వారికి వెంటనే రియాక్షన్ కౌంటర్ ఇవ్వాలని తీర్మానించినట్లు స్పష్టం చేశారు. చాలామంది అనర్హులు పత్రికలకు పనిచేస్తున్నామని, యూట్యూబ్ ఛానల్ కు పని చేస్తున్నమని కొంతమంది వారి, వారి వివిధ వాహనాలపై ప్రెస్ స్టిక్కర్స్ అంటించుకుని అసలైన పాత్రికేయులకు అవమానాలు తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయంపై సిపి, డిసిపిల దృష్టికి తీసుకువెళ్లి అసలైన మీడియా ప్రతినిధులకు పోలీస్ ప్రెస్ స్టిక్కర్లు అందజేసే విధంగా చొరవ తీసుకుంటామని తెలిపారు. అనంతరం మందమర్రి ప్రెస్ క్లబ్ మిత్రబృందం విన్నపాలను విన్నారు. గతంలో మందమర్రి పట్టణానికి చెందిన బొడ్డు రవి వాల్మీకి మృతిచెందితే అతని కుటుంబానికి 5 లక్షల రూపాయల పరిహారంతో పాటు తన భార్యకు మూడు వేల రూపాయల పెన్షన్ మంజూరు చేపించిన ఘనత టియు డబ్ల్యూ జే అని కొనియాడారు. వివిధ మండలాలలో ఏర్పడిన పాత్రికేయుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని తక్షణమే పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ కోశాధికారి వంశీ, ఉపాధ్యక్షులు సురేష్ చౌదరి, మద్దెల సంజీవ్, టి రవిరాజ్, చిలివేరి నర్సయ్య, కొండు శ్రీనివాస్, బిరుదుల దేవరాజ్, కలువల శ్రీనివాస్, ఆర్ రమేష్, దెబ్బటి తిరుపతి, ఉదయ్ కుమార్, సత్యం, శ్రీనివాస్, రాజేష్ ఉన్నారు.

# విస్తృతంగా వాహనాల తనిఖీలు

**ఆదిలాబాద్, మహా:** వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నియమాలు ఉల్లంఘిస్తున్న వాహనదారులకు చలాన్లు విధిస్తున్నారు. పట్టణంలోని తెలంగాణ తల్లి కూడలి, కలెక్టర్ చౌక్ తదితర ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ముఖ్యంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలను స్టేషన్ కు తరలించి అప్పటికపుడు నంబర్ ప్లేట్లు బిగించేలా చర్యలు తీసుకుంటున్నారు. వాహనాలను సంబంధించిన సరైన ధ్రువపత్రాలు, ఇన్సురెన్సు లేకపోతే చలనాలు విధించడంతో పాటు వాహనదారులు నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నారు.



## వెజ్ ప్రొటీన్ స్లైస్‌ను విడుదల చేసిన మెక్‌డొనాల్డ్స్

### సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ సహకారంతో అభివృద్ధి

ఆహార ప్రియులకు ఆరోగ్యకరమైన, మరింత స్థిరమైన ఫాస్ట్ ఫుడ్‌ను అందించాలనే లక్ష్యంతో మెక్‌డొనాల్డ్ ఇండియా (వెస్ట్ & సౌత్) 'ప్రొటీన్ ప్లస్ స్లైస్'ను విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ వెజిటేరియన్ ఆధారిత ఆవిష్కరణ కోసం మెక్‌డొనాల్డ్ సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ - సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)తో జత కట్టినట్లు పేర్కొంది.

**ప్రొటీన్ ప్లస్ స్లైస్**

ప్రొటీన్ ప్లస్ స్లైస్ అనేది మొక్కల ఆధారిత ప్రొటీన్ స్లైస్. ఇది అధిక పోషకాలు కలిగి మాంసాహార ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. ముఖ్యంగా భారతీయ అభిరుచులు, ఆహార ప్రాధాన్యతలకు అనుగుణంగా దీన్ని తయారు చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ స్లైస్ 100% శాఖాహారంతో తయారు చేసినట్లు చెప్పింది. ఇందులో మొక్కల ఆధారిత ప్రొటీన్ అధికంగా ఉంటుంది. భారతీయ ఆహార సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్థానికంగా అభివృద్ధి చేశారు.

**సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ సహకారం**

ఈ స్లైస్ ఆవిష్కరణకు మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐతో ఒప్పందం కుదుర్చుకోవడం మరింత విశ్వసనీయతను చేకూరుస్తుందని కంపెనీ నమ్ముతుంది. పప్పులు, తృణధాన్యాల నుంచి సేకరించిన మొక్కల ఆధారిత ప్రొటీన్లను ఉపయోగించి పోషకాల సమతుల్యానికి సీఎఫ్‌టీఆర్ఐ పరిశోధనలు ఎంతో తోడ్పడ్డాయని మెక్‌డొనాల్డ్ తెలిపింది. స్థిరమైన, ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారానికి భారత్‌లో డిమాండ్ పెరుగుతుందని చెప్పింది. ఈ అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్నట్లు స్పష్టం చేసింది. వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వరల్డ్ నిర్వహిస్తున్న మెక్‌డొనాల్డ్స్ ఇండియా (వెస్ట్ & సౌత్) మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళలోని అవుట్‌లెట్ల మెనూలో ఈ ప్రొటీన్ ప్లస్ స్లైస్‌ను ఉంచబోతున్నట్లు తెలుస్తుంది. కస్టమర్ల నుంచి ఫీడ్‌బ్యాంక్ తీసుకొని, దాన్ని విశ్లేషించిన తర్వాత ఇతర ప్రాంతాలకు దీన్ని విస్తరిస్తామని కంపెనీ తెలిపింది.



## ఇండియా-యూకే ట్రేడ్ డీల్ వ్యవసాయానికి జాక్‌పాట్



భారత వ్యవసాయ రంగానికి ఇండియాయూకే ఇటీవల సంతకం చేసిన కాంప్రహెన్సివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (సీఈటీఏ) ఎంతో మేలు చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఎగుమతుల్లో 95% యూకే మార్కెట్‌లో సుంకం లేకుండా అనుమతించే వీలుంది. ఇది భారతీయ రైతులు, వ్యవసాయ ఎగుమతిదారులకు మార్కెట్ అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం వ్యవసాయానికి సంబంధించి కొన్ని ప్రధాన అంశాలు కింది విధంగా ఉన్నాయి.

**జీరో-డ్యూటీ యాక్సెస్**

- బాస్మతి, బాస్మతియేతర బియ్యం
- పండ్లు మరియు కూరగాయలు
- మసాలా దినుసులు (పసుపు, మిరియాలు, యాలకులు)
- ప్రాసెస్ చేసిన ఆహారాలు (ఊరగాయలు, మసాలా మిశ్రమాలు, పండ్ల గుజ్జులు, రెడీ టు ఈట్ భోజనం)
- సముద్ర ఉత్పత్తులు (రొయ్యలు, ట్యూనా, ఫిష్ మీల్, ఫిష్ ఫీడ్)
- పాడి, వంట నూనెలు, యాపిల్స్ సుంకం రాయితీ పరిధిలోకి రావు. ఇది కీలకమైన దేశీయ పరిశ్రమలను కాపాడుతుంది.
- గతంలో 70 శాతం వరకు దిగుమతి సుంకాలను ఎదుర్కొన్న ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఇప్పుడు జీరో డ్యూటీ పరిధిలోకి రానున్నాయి.
- వచ్చే మూడేళ్లలో యూకేకు భారత వ్యవసాయ ఎగుమతుల్లో 20% వృద్ధి నమోదవుతుందని అంచనా. ఇది భారతదేశం తన 100 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతి లక్ష్యానికి చేరువ కావడానికి సహాయపడుతుంది. ప్రస్తుతం 2.25 శాతం మాత్రమే ఉన్న బ్రిటన్ 5.4 బిలియన్ డాలర్ల సముద్ర దిగుమతుల్లో భారత్ వాటాను ఈ వాణిజ్య ఒప్పందం పెంచుతుందని భావిస్తున్నారు.

## రూ.10 వేలలోపు కేటగిరిలో మరో కొత్త స్మార్ట్ ఫోన్

రూ.10 వేల లోపు కేటగిరిలో మరో కొత్త స్మార్ట్ ఫోన్ విడుదలైంది. హెచ్‌డీ+ డిస్‌ప్లే, 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఐపీ64 వాటర్ రెసిస్టెన్స్, 3.5 ఎంఎం హెడ్ ఫోన్ జాక్, ఎన్ఎఫ్‌సీ, ఎఫ్ఎం రేడియో సపోర్ట్ తో ఇన్ఫినిక్స్ కొత్త ఫోన్ ను లాంచ్ చేసింది. ఈ కొత్త ఫోన్ వివో టీ4 లైట్, పోకో ఎం7, లావా స్టార్మ్ ప్లే ఫోన్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.

**ఇన్ఫినిక్స్ స్మార్ట్ 10 ధర.. లభ్యత**

ఇన్ఫినిక్స్ స్మార్ట్ 10 స్మార్ట్‌ఫోన్ 4 జీబీ ర్యామ్ / 64 జీబీ స్టోరేజ్ వేరియంట్‌లో మాత్రమే వస్తుంది. దీని ధర రూ .6,799. ఐరిస్ బ్లూ, ట్విలైట్ గోల్డ్, టైటానియం సిల్వర్, స్లీక్ బ్లాక్ రంగుల్లో ఈ ఫోన్ లభిస్తుంది. ఆగస్టు 2వ తేదీ నుంచి ఫ్లిప్ కార్ట్ లో ఈ ఫోన్ సేల్ ప్రారంభం కానుంది.

**ఇన్ఫినిక్స్ స్మార్ట్ 10 స్పెసిఫికేషన్లు**



- ఇన్ఫినిక్స్ స్మార్ట్ 10లో 6.67 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 700 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి.
- ఇది ఐపీ 64 వాటర్ రెసిస్టెన్స్, డస్ట్ రెసిస్టెన్స్ రేటింగ్ తో వస్తుంది. అంటే ఫోన్‌పై దుమ్ము, నీటి చుక్కలు పడినా ఏమీ అవ్వదు కానీ నీటిలో పూర్తిగా మునిగిపోకుండా ఉండాలి.
- స్మార్ట్ 10 డీటీఎస్ ట్యూన్ చేసిన డ్యూయల్ స్పీకర్ సెటప్ తో వస్తుంది. 300% వాల్యూమ్ బూస్ట్ ను సపోర్ట్ చేస్తుంది.
- ఏ55 జీపీయూతో కూడిన యూనిసోక్ టీ7250 ప్రాసెసర్ పై ఈ ఫోన్ పనిచేస్తుంది. ఈ ఏడాది లాంచ్ అయిన ఇతర ఇన్ఫినిక్స్ ఫోన్ల మాదిరిగానే, ఈ స్మార్ట్ 10 ఆండ్రాయిడ్ 15 ఆధారిత కంపెనీ తాజా ఎక్స్ఓఎస్ 15 పై పనిచేస్తుంది.
- ఇందులో 4 జీబీ ఎల్‌పీడీడీఆర్ 4ఎక్స్ ర్యామ్, 64 జీబీ స్టోరేజ్‌ను అందించారు. మైక్రో ఎస్ డీ కార్డ్ స్లాట్ ద్వారా స్టోరేజ్ ను 2 టీబీ వరకు పెంచుకునే వెసులుబాటు కూడా ఉంది.
- ఆప్టిక్స్ విషయానికొస్తే, ఫోన్లలో 8 మెగాపిక్సెల్ ప్రైమరీ సెన్సార్, వెనుక భాగంలో డెప్త్ సెన్సార్ ఉన్నాయి. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందువైపు 8 మెగాపిక్సెల్ షూటర్ ఉంది. రియర్, ఫ్రంట్ కెమెరా రెండూ 2కే 30 ఎఫ్‌పీఎస్ వేగంతో వీడియోలను షూట్ చేయగలవు.
- 15వాట్ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో 5,000 ఎంఏహెచ్ బ్యాటరీని ఇందులో అందించారు. రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సపోర్ట్ కూడా ఉంది.



# దేశం-విదేశం


NATIONAL-INTERNATIONAL



## గదగ్‌లో లవ్ జిహాద్

### మతమార్పిడితో పాటు యువకుడి పేరు మార్పు

### మైనర్‌తో వివాహంపై భర్తపై పోక్సో కేసు నమోదు



**రాయచూరు రూరల్(కర్ణాటక):** గదగ్‌లో విడ్డూరమైన లవ్ జిహాద్ కేసులో కట్టుకున్న భర్తపైనే భార్య పోక్సో కేసు పెట్టించిన ఉదంతం వెలుగు చూసింది. వివరాలు.. గదగ్‌లోని బెటగేరి ప్రాంతంలో విశాల్ కుమార్ అనే వ్యక్తి మైనార్టీ సముదాయానికి చెందిన యువతి మూడేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. వీరిద్దరూ గత ఏడాది నవంబర్‌లో వివాహం చేసుకున్నారు. అయితే నిఖా సమయంలో తనను మతమార్పిడి చేయడమే కాకుండా మసీదులో విరాజ్ సాబ్‌గా తన పేరును మార్చారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ తాజాగా వారం రోజుల క్రితం పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాడు. దీనిని గమనించిన యువతి మైనార్టీ తీరని 17 ఏళ్ల అమ్మాయిని వివాహం చేసుకొన్నట్లు భర్తపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ అధికారుల అక్రమాల పుట్టపగులుతోంది.. తవ్వే కొద్దీ డబ్బే డబ్బు



**భువనేశ్వర్:** అవినీతికి పాల్పడుతున్న అటవీశాఖ అధికారుల్ని విజిలెన్స్ అధికారులు ఆట కట్టిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు అటవీ శాఖ అధికారుల ఇళ్లలో విజిలెన్స్ శాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఓ అధికారికి 116 ఫ్లాట్లు గుర్తించగా.. మరో అధికారి ఇంట్లో తవ్వే కొద్దీ నోట్ల కట్టలు, గోల్డ్ కాయిన్లు, ఇతర బంగారు ఆభరణాలు వెలుగులోకి వచ్చాయి. సదరు అధికారుల ఇళ్లల్లో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆరో ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేశారు. ఈ సోదాల్లో అటవీశాఖ డిప్యూటీ రేంజర్ రామ చంద్ర నాయక్ నివాసంలో ఆదాయానికి మించిన రూ.1.44 కోట్ల క్యాష్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయనకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ ఆస్మిక తనిఖీలు చేపట్టారు అధికారులు. తనిఖీల్లో జయపూర్‌లోని ఆయన ఫ్లాట్‌లో రహస్య గదిలో దాచిన రూ. 1.44 కోట్ల నగదు, 4 బంగారు బిస్కెట్లు, 16 బంగారు నాణేలు (ప్రతి నాణెం 10 గ్రాములు),6 ప్రాంతాల్లోని జయపూర్, భువనేశ్వర్‌లోని ఆయన నివాసాలు, బంధువుల ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయి. కాగా, ఈ దాడుల్లో ఆరుగురు డీఎస్పీలు, ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, తొమ్మిదిమంది ఏఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కరెన్సీ కౌంటింగ్ మెషీన్లు ఉపయోగించి నగదు లెక్కింపు కొనసాగుతోంది. ఈ దాడికి ముందు మరో అటవీ శాఖ అధికారి నివాసాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సదరు అధికారికి 119కి పైగా ఫ్లాట్లు ఉన్నట్లు తేలింది.

## టేకాఫ్ అయిన పావుగంటకే..

అహ్మదాబాద్ ఘటన తర్వాత.. విమానాల్లో, అందునా ఎయిరిండియా సంస్థ విమానాల్లోనే ఎక్కువగా సాంకేతిక సమస్యలూ బయటపడుతున్నాయి. ఈ క్రమంలో విమానాల ఆలస్యం, రద్దు, దారి మళ్లింపు, వెనక్కి రావడం లాంటి ఘటనలూ నమోదు అవుతున్నాయి. జైపూర్ నుంచి ముంబై బయల్దేరిన ఎయిరిండియా విమానం.. పావుగంటకే సాంకేతిక సమస్యతో వెనక్కి వచ్చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 1.35గం.కు బయల్దేరిన విమానం.. 18 నిమిషాల తర్వాత తిరిగి జైపూర్ ఎయిర్‌పోర్టుకే వచ్చేసింది. సాంకేతిక సమస్య తలెత్తడంతోనే విమానాన్ని పైలట్ వెనక్కి తీసుకురావాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. అందులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారన్నది తెలియాల్సి ఉంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్పష్టత రావాల్సి ఉంది. బుధవారం(జులై 23వ తేదీ) సైతం ఇలాంటి ఘటనలు రెండు జరిగాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ముంబైకి 160 మంది ప్రయాణికులతో బయల్దేరాల్సిన ఎయిరిండియా విమానం.. సాంకేతిక సమస్యతో రద్దయ్యింది. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమంటూ ఆ సమయంలో ఎయిరిండియా ప్రకటించింది. అదే రోజు.. కేరళ కాలికట్ (కోజికోడ్) నుంచి దోహాకు 188 మందితో(సిబ్బంది సహా) బయల్దేరిన ఎయిరిండియా విమానం..రెండు గంటల తర్వాత తిరిగి కాలికట్ ఎయిర్‌పోర్టుకే చేరుకుంది. ఇది కూడా సాంకేతిక సమస్యతోనే వెనక్కి వచ్చినట్లు విమానయాన సంస్థ ప్రకటించింది.

## భారత్‌లో తొలి హైడ్రోజన్ కోచ్ పరీక్ష విజయవంతం



దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ కోచ్‌ను విజయవంతంగా పరీక్షించి.. భారతీయ రైల్వే చరిత్ర సృష్టించింది. ఈ వీడియోను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ఈ రైళ్లు.. కాలుష్యాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. పర్యావరణానికి హానికరం కాని, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు భారత్ అడుగులు వేస్తోంది. ఇది భారతీయ రైల్వేను మరింత టెక్నాలజీ పరంగా అభివృద్ధి చేయడంతో ముందడుగు పడింది. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడం.. భారత్‌ని హైడ్రోజన్ ఆధారిత రైల్వే సాంకేతికతలో ప్రపంచదేశాల సరసన అగ్రగామిగా నిలబెడుతుందని అశ్విని వైష్ణవ్ ట్వీట్ చేశారు. భారత్ 1,200 HP హైడ్రోజన్ రైలును అభివృద్ధి చేసింది. ఇది దేశీయ రవాణా రంగానికి ఒక కీలక మైలురాయి''అని ఆయన పేర్కొన్నారు. మొత్తం హైడ్రోజన్‌పవర్డ్ కోచ్ (డ్రైవింగ్ పవర్ కార్) చెన్నైలోని ఐసీఎఫ్ వద్ద విజయవంతంగా పరీక్షించబడిందన్నారు. హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్ పథకంలో భాగంగా 35 హైడ్రోజన్ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ రైళ్లను దేశ వ్యాప్తంగా హెరిటేజ్, హిల్ స్టేషన్లలో నడపాలని భావిస్తోంది. భారతీయ రైల్వే ఇప్పటికే ఉన్న డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ ను హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్‌తో నడిచే విధంగా చేసే పైలట్ ప్రాజెక్ట్‌ను కూడా రైల్వేశాఖ చేపట్టింది.

## ఆపరేషన్ సిందూర్ ఆన్‌లోనే ఉంది: సీడీఎస్




**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రదాడిలో తర్వాత పాకిస్తాన్‌లో ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అనేది ఇంకా ఆన్‌లోనే ఉందని సీడీఎస్(చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం జూలై 25) ఢిల్లీలో జరిగిన డిఫెన్స్ సెమినార్‌కు హాజరైన అనిల్ చౌహాన్ మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్ అనేది అవసరమైన సందర్భంలో మళ్లీ జూలు విదల్చడానికి ఇంకా సిద్ధంగానే ఉందన్నారు.

**అది నిరంతరం నేర్చుకునే ప్రక్రియ**

ఇక భారతదేశ యుద్ధ సామర్థ్యం గురించి ఆయన పలు కీలక విషయాలను చెప్పుకొచ్చారు. యుద్ధ సంసిద్ధత అనేది చాలా హైలెవెల్‌లో ఉండాలన్నారు. యుద్ధ సామర్థ్యాన్ని పెంపుదించుకోవడానికి ప్రతి గడియా, ప్రతి నిమిషం కూడా చాలా అవసరమన్నారు. అటు సస్త్ర(యుద్ధం) ఇటు శాస్త్రం(జ్ఞానం) అనేవి మిలటరీకి 24x7, 365 రోజులు చాలా కీలకమన్నారు.

**మూడు స్థాయిల్లో మాస్టర్ కావాలి..**

యుద్ధ రంగంలోకి దిగే సైనికుడు ప్రధానంగా మూడు స్థాయిల్లో మాస్టర్ కావాల్సిన అవసరం ఉందన్నారు. అందులో, నిర్దిష్టమైన ప్రణాళిక, వ్యూహాత్మకత, కార్యాచరణ, అనేవి యుద్ధ రంగంలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. వీటిలో ప్రతీ సైనికులు ఆరితేరి ఉండాలన్నారు. ఇది ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందకు సాగడమే తప్ప ఇందులో షార్ట్ కట్స్ అంటూ ఏమీ ఉండవన్నారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానం యొక్క నిరంతర పురోగతి ద్వారా మనం అపూర్వమైన వేగాన్ని చూస్తున్నామని, దాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగితేనే యుద్ధంలో పైచేయి సాధిస్తామన్నారు.

కాగా, ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది అసువులు బాసారు. కశ్మీర్ పర్యాటక ప్రాంతాల్నిచూడటానికి వెళ్లిన పర్యాటకులు ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనేఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టింది.

మే 7వ తేదీన భారత్ చేపట్టిన ఈఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ ఉనికిలో లేకుండా పోయే ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది.ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్ అతాలకుతలమైంది. భారత్ దాడుల్ని తిప్పి కొట్టలేక ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో పడిపోయింది. ఆపరేషన్ సింధూర్ తర్వాత పాకిస్తాన్ కాస్త దారికొచ్చింది.

ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌లోకి చొచ్చుకుపోయిని భారత ఆర్మీ బలగాలు అక్కడ కీలక ఉగ్రస్థావరాలను చిన్నాభిన్నం చేశారు. సుమారు వందమందికి పైగా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడం ఒకటైతే, ఉగ్రస్థావరాలు ఉన్న చోటల్లా భారత్ చేసిన దాడులకు పాకిస్తాన్ ఊపిరి తీసుకోలేకపోయింది. అలాగే పాక్ ఆర్మీ క్యాంపుల్ని కూడా భారత్ టార్గెట్ చేసి పైచేయి సాధించింది. భారత్ దాడులకు గుక్క తిప్పులేకపోయిన పాకిస్తాన్.. మే 10వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చింది. పాకిస్తాన్ మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్.. భారత్ ఆర్మీకి ఫోన్ చేసి కాల్పుల విరమణ ఒప్పందానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు.. అదే సమయంలో పాకిస్తాన్ మళ్లీ ఎటువంటి దుస్సాహసానికి పాల్పడ్డాఆపరేషన్ సిందూర్ ఆన్‌లోనే ఉందని గట్టి హెచ్చరికల నడుమ కాల్పుల విరమణకు అంగీకరించింది భారత్.



## రాజ్యసభ ఎంపీగా కమల్ హాసన్..
# తమిళంలో ప్రమాణ స్వీకారం

మక్కల్‌నీది మయ్యం నేత , సినీ నటుడు కమలహాసన్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెబుతున్నారు. తమిళంలో ప్రమాణస్వీకారం చేసి తమ భాషపై కమల్ మక్కువ చాటుకున్నారు. ఆయనతో పాటు తమిళనాడు నుంచి మరో ఐదుగురితో డిప్యూటీ చైర్ పర్సన్ హరివంశీ ప్రమాణస్వీకారం చేపించారు. ఒక భారతీయుడిగా తన విధిని నిర్వర్తిస్తానంటూ కమల్ కామెంట్ చేశారు. గత లోక్ సభ ఎన్నికల సమయంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కమల్‌కు రాజ్యసభ అవకాశాన్ని డీఎంకే కల్పించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 2018, ఫిబ్రవరి 21వ తేదీన కమల్ హాసన్ ఎన్ఎంఎం పార్టీని మధురైలో స్థాపించారు. అప్పటి నుంచి ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రభావం చూపెట్టలేకపోయింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీ చేసినప్పటికీ. ఆశించిన ఫలితం సాధించలేకపోయింది. అయితే.. ఓటు షేర్ మాత్రం 3.72 శాతం దక్కించుకుంది. మరీ ముఖ్యంగా చెన్నై, కోయంబత్తూరు, మధురైలో భారీగా ఓట్లు పడ్డాయి.

# ఆజ్ కీ రాత్ రీమిక్స్‌లో..?



షారుక్ ఖాన్‌తో 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్ (2006), డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' సినిమాలను తెరకెక్కించి, హిట్స్ అందుకున్నారు దర్శకుడు ఫర్హాన్ అక్తర్. తాజాగా ఫర్హాన్ డైరెక్షన్‌లోనే 'డాన్ 3' రానుంది. అయితే 'డాన్ 3' చిత్రంలో షారుక్ ఖాన్ హీరోగా చేయడం లేదు. రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్నారు. హీరోయిన్‌గా కియారా అద్వానీని ప్రకటించారు. కానీ ఈ సినిమా ఇంకా సెట్స్‌పైకి రాలేదు. కాగా ఇటీవల ఓ పాపకు జన్మనిచ్చారు కియారా. దీంతో కియారా సెట్స్‌కు రావడం కుదరదని, ఆమె ప్లేస్‌లో మేకర్స్ కృతీ సనన్‌ను హీరోయిన్‌గా తీసుకున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ఓ దశలో 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్ (2006), డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ప్రియాంకా చోప్రా 'డాన్ 3'లోనూ నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. కాగా ప్రస్తుతం 'ధురంధర్' సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు రణ్‌వీర్ సింగ్. డిసెంబరు 5న ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దీంతో ముందుగా ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేయాలనుకుంటున్నారు రణ్‌వీర్. ఆ విధంగా 'డాన్ 3' చిత్రీకరణ వాయిదా పడింది. జనవరిలో షూటింగ్ ఆరంభించాలనుకుంటున్నారు మేకర్స్. ఎలాగూ 'డాన్ 3' సినిమా స్టార్ట్ కావడానికి ఇంకా సమయం ఉంది కాబట్టి, ముందుగా ప్రకటించినట్లుగానే హీరోయిన్‌గా కియారా అద్వానీనే నటింపజేయాలనుకుంటున్నారట. ఇక 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' (2006) సినిమాలో 'ఆజ్ కీ రాత్' పాట ఉన్న విషయం తెలిసిందే. ఈ పాపులర్ సాంగ్‌ను 'డాన్ 3'లో రీమిక్స్ చేసి, ఈ స్పెషల్ సాంగ్‌లో కృతీ సనన్‌తో డ్యాన్స్ చేయిస్తే బాగుంటుందని, ఈ సాంగ్‌లో ప్రియాంకా చోప్రా గెస్ట్‌గా కనిపిస్తే బాగుంటుందని ఫర్హాన్ భావిస్తున్నారట. ఆ దిశగా కృతీతో చర్చలు జరుపుతోందట 'డాన్ 3' టీమ్. మరి... 'ఆజ్ కీ రాత్' సాంగ్‌లో రణ్‌వీర్‌తో కలిసి కృతీ సనన్ స్టెప్పులేస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. 'డాన్, డాన్ 2' చిత్రాలకు సంగీతం అందించిన శంకర్–ఇషాన్–లాయ్ త్రయమే 'డాన్ 3'కీ సంగీతం అందించనున్నారు.



## గొప్ప మనసు చాటుకున్న సోనూ సూద్..
# ఫిష్ వెంకట్ ఫ్యామిలీకి సాయం!

బాలీవుడ్ నటుడు సోను సూద్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ విషాద సమయంలో వారికి ఆర్థికసాయం అందించారు. తనవంతు సాయంగా లక్షన్నర రూపాయలు ఫిష్ వెంకట్ కుటుంబానికి అందించారు. అంతే కాకుండా సోనూ సూద్ కూడా వ్యక్తిగతంగా ఫిష్‌వెంకట్ భార్య, కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడినట్లు తెలుస్తోంది. కాగా.. ఇటీవల కిడ్నీల సమస్యతో ఆస్పత్రిలో చేరిన ఫిష్ వెంకట్ కోలుకోలేక మృతి చెందారు. ఫిష్ వెంకట్ పరిస్థితి గురించి తెలుసుకున్న కొందరు ఆయన వైద్యం కోసం ఆర్థికసాయం అందించారు. అయినప్పటికీ సరైన సమయంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరగకపోవడంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కాగా.. జూనియర్ ఎన్టీఆర్ అదుర్స్ సినిమాతో ఫేమస్ అయిన ఫిష్ వెంకట్ పలు టాలీవుడ్ చిత్రాల్లో మెప్పించారు. ఆ తర్వాత గబ్బర్ సింగ్, ఖైదీ నంబర్ 150, శివం లాంటి చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించారు. కమెడియన్‌గా మాత్రమే కాదు విలన్ పాత్రల్లోనూ అభిమానులను మెప్పించారు. ఫిష్ వెంకట్ చివరిసారిగా కాఫీ విత్ ఎ కిల్లర్‌లో కనిపించాడు.

## రష్మిక డియర్ డైరీ వెనుక దాగున్న
# కొంత కష్టం.. ఎంతో ఇష్టం



నేషనల్ క్రష్ అంటే ఎవరు? ఈ ప్రశ్నకు ఇప్పటిదాకా రష్మిక అని ఒకటే సమాధానం ఉండొచ్చు కానీ ఇప్పుడు మరో నేషనల్ క్రష్ కూడా వచ్చేసింది. పైగా రష్మిక తానే స్వయంగా తెచ్చేసింది. పాన్ ఇండియా లెవల్లో క్రేజీ హీరోయిన్‌గా మారి అందం అభినయంతో పరవశాలను పంచుతున్న మన శ్రీవల్లి...డియర్ డైరీ పేరుతో పరిమళాలను కూడా మోసుకొస్తోంది. ఇటీవలే పెర్‌ఫ్యూమ్ వ్యాపారంలోకి అడుగుపెట్టిన రష్మిక దీని వెనుక తన ఆలోచనలను అనుభవాలను భావోద్వేగాలను పంచుకుంది.

అన్ని విధాలుగా, రెండు సంవత్సరాల వ్యయప్రయాసల అనంతరం రూపుదిద్దుకున్న డియర్ డైరీ, రష్మిక మందన్నకు కేవలం ఒక ప్రముఖ సువాసనల ఉత్పత్తికంటే ఎక్కువ. , తన చిన్నతనంలో వ్రాసిన జర్నల్ ఎంట్రీల నుంచి ప్రేరణ పొంది, తరువాత అదే పేరుతో తన ప్రసిద్ధ ఇన్‌స్టాగామ్ సిరీస్‌లోనూ మనం చూసిన డియర్ డైరీ...''ఇది కేవలం వ్యాపార వెంచర్ కాదు,'' అని ఆమె చెప్పింది. ''సువాసన నాకు చాలా వ్యక్తిగతమైనది. ఇది నన్ను తక్షణమే చిన్ననాటి క్షణాలకు తీసుకువెళుతుంది. నా తల్లి బాడీ లోషన్, కూర్గ్ గాలి సువాసన, నా జీవితంలో ముఖ్యమైన అధ్యాయాలలో నేను ధరించిన పెర్ఫ్యూమ్'' అంటూ ఆమె గుర్తు చేసుకుంటుంది. '' ఈ పెర్ఫ్యూమ్‌లు నేను తిరిగి ఇచ్చే మార్గం. ఇది నాకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత కౌగిలింత''అంటోంది.

డియర్ డైరీ అనే పేరు వెనుక.. '' నేను కూర్చుని డైరీ రాసేదానిని. దానికి వేరే పేరు పెట్టాల్సిన అవసరం నాకు ఎప్పుడూ రాలేదు దాన్ని ఎప్పుడూ 'డియర్ డైరీ' అని సంబోధించేదాన్ని. సంవత్సరాల తరువాత, నేను ఇన్‌స్టాగామ్‌లో సిరీస్‌ను ప్రారంభించినప్పుడు, జీవితంలోని చిన్న, నిశ్శబ్ద విషయాలు ముఖ్యమైనవని ప్రజలకు గుర్తు చేయాలనుకున్నాను అందుకే అది సహజమైన కొనసాగింపుగా మారింది'' అని వెల్లడిస్తుంది.

కర్ణాటకలోని కొడగు (గతంలో కూర్గ్) జిల్లాలోని ఒక చిన్న ప్రాంతమైన విరాజ్‌పేట (విరాజపేట అని కూడా పిలుస్తారు)లో పుట్టి పెరిగిన రష్మిక, కర్ణాటక కొండ ప్రాంత దట్టమైన పచ్చదనం మట్టి గాలితో ఊసులాడుతూ పెరిగింది, ఆమె జ్ఞాపకాలలోకి చొచ్చుకుపోయిన అవన్నీ ఇప్పుడు ఆమె బ్రాండ్.లో ప్రతిఫలిస్తాయి ''అక్కడ ప్రతీ ఇంటికి ఒక వాసన ఉంది'ఆ విషయం''అలాంటి ప్రదేశంలో పెరిగిన ఎవరైనా మీకు చెబుతారు.'' అంటుందామె. 'నేను ఆ పెర్ఫ్యూమ్‌ని వేరేగా చూడలేదు. నేను దానిని నాలాగా చూశాను. నేను కేవలం రష్మిక నే అయితే...నేషనల్ క్రష్, ఇర్రీప్లేసబుల్, కాంట్రవర్షియల్ - అనే పేర్లు నాకు వచ్చాయి. కాబట్టి ఇప్పుడు అవి కూడా ఈ బ్రాండ్‌లో భాగం అయ్యాయి'' అంటూ వివరించింది.

ప్రపంచ బ్యూటీ లేబుల్‌లను స్కేలింగ్ చేయడంలో ప్రసిద్ధి చెందిన న్యూయార్క్‌కు చెందిన ది పిసిఎ కంపెనీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ఉత్పత్తి డియర్ డైరీ, దీనిలో 3 ఫ్లేవర్స్‌కి నేషనల్ క్రష్, ఇర్రీప్లేసబుల్, కాంట్రవర్షియల్ అంటూ పేర్లు పెట్టడం విశేషం.మనం కలలు కంటాం. కానీ వాస్తవికత వేరోలా ఉంటుంది' అని ఆమె చెప్పింది. ఈ పెర్ఫ్యూమ్ గురించి ''ఇది నా బిడ్డ. మా వంతు ప్రయత్నం చేసాం. ఇప్పుడు అది అందరికీ అందుబాటులో ఉంది, దీని గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో వినడానికి సిద్ధంగా ఉన్నాం. వారి అభిప్రాయంతో మా బిడ్డ పెరగాలని నేను కోరుకుంటున్నాను.' అంటూ చెబుతోంది రష్మిక.. చూడాలి మరి నేషనల్ క్రష్ వ్యాపారంలో ఎంతగా ఎదుగుతుందో.



## పాపం ఆస్ట్రేలియా స్థానికులు..
# దెబ్బకు వణికిపోయారు

గత కొన్నేళ్లలో చూసుకుంటే పలు దేశాల మధ్య యుద్ధం తరహా పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా థాయ్ ల్యాండ్, కంబోడియా మధ్య ఓ దేవాలయం విషయమై పెద్ద గొడవే జరుగుతుంది. ఎక్కడికక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. సరిగ్గా ఇలాంటి టైంలో ఎవరైనా మీరు నివసించే ప్రదేశంలో 'వార్' అని రాస్తే ఎలా ఉంటుంది. గజగజ వణికిపోతారు కదా! ఇప్పుడు ఆస్ట్రేలియాలోనూ అలాంటిదే జరిగింది.

**ఇంతకీ ఏంటి విషయం?**

గురువారం ఉదయం ఆస్ట్రేలియాకు చెందిన ఓ నెటిజన్.. తాను నివసించే మెల్‌బోర్న్‌లో ఆకాశంలో ఎవరో 'వార్ 2' అని రాశారని, దీని గురించి ఎవరికైనా తెలుసా? అని ట్వీట్ చేశారు. రిప్లై ఇచ్చిన మరో నెటిజన్.. 'తమ అభిమాన హీరో ఎన్టీఆర్ కొత్త సినిమా 'వార్ 2'ని ప్రమోట్ చేసేందుకు ఇలా ప్రేమ చూపించాం' అని చెప్పుకొచ్చాడు. దీనిపై స్పందించిన సదరు నెటిజన్.. 'సడన్‌గా ఆకాశంలో వార్ అని రాస్తే మా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి' అని తన భయాన్ని బయటపెట్టింది.

పాపం ఆస్ట్రేలియా ప్రజలు. ఎన్టీఆర్ అభిమానులు చేసిన ఈ పని వల్ల తెగ భయపడిపోయారు. 'వార్ 2' సినిమా గురించి మనవాళ్లకు తెలుసు. కాబట్టి ఇక్కడా ఇలా రాసినా పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. కానీ దేశం కానీ దేశంలో ఇలా అభిమానం చూపించేసరికి అక్కడి ప్రజలు నిజంగా యుద్ధం ఏమోనని తెగ భయపడిపోయారు. చెప్పాలంటే వణికిపోయింటారు. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 'వార్ 2' విషయానికొస్తే.. ఎన్టీఆర్ చేస్తున్న తొలి బాలీవుడ్ మూవీ. యష్‌రాజ్ ఫిల్మ్స్ ఫ్రాంచైజీలో తీస్తున్న ఈ సినిమాలో హృతిక్ రోషన్ హీరో కాగా, ఎన్టీఆర్ నెగిటివ్ టచ్ ఉన్న పాత్ర చేస్తున్నాడు. కియారా అడ్వాణీ హీరోయిన్. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఆగస్టు 14న థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు.

# బిడ్డ కోసం అప్పుడే మొదలుపెట్టేశారు



మెగాహీరో వరుణ్ తేజ్ త్వరలో తండ్రి కాబోతున్నాడు. ఈ ఏడాది మే నెలలో తన భార్య లావణ్య త్రిపాఠి ప్రెగ్నెన్సీతో ఉన్న విషయాన్ని బయటపెట్టాడు. అప్పటినుంచి ఓవైపు సినిమా చేస్తూనే మరోవైపు భార్యతో ఎప్పటికప్పుడు టూర్స్ వేస్తూనే ఉన్నాడు. ఇకపోతే పుట్టబోయే బిడ్డ కోసం ఇప్పటినుంచే షాపింగ్ కూడా మొదలుపెట్టేశారు. ఈ విషయాన్ని స్వయంగా లావణ్య త్రిపాఠినే బయటపెట్టింది.

నాగబాబు కొడుకు వరుణ్ తేజ్. 'ముకుంద' సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు. ఫిదా, కంచె లాంటి చిత్రాలతో ఆకట్టుకున్నాడు. ఎఫ్ 2, ఎఫ్ 3 మూవీస్‌తో హిట్స్ కొట్టాడు. కానీ తర్వాత నుంచి సినిమాలైతే చేస్తున్నాడు గానీ సక్సెస్ కాలేకపోతున్నాడు. గతేడాది 'మట్కా'తో వచ్చాడు కానీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఓ హారర్ కామెడీ చిత్రం చేస్తున్నాడు. అసలు విషయానికొస్తే తనతో కలిసి సినిమాలు చేసిన హీరోయిన్ లావణ్య త్రిపాఠిని ఆరేడేళ్ల పాటు ప్రేమించిన వరుణ్ తేజ్.. 2023 నవంబరులో పెళ్లి చేసుకున్నాడు. ఈ మే నెలలో తాము తల్లిదండ్రులు కాబోతున్న విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు రాబోయే బేబీ కోసం షాపింగ్ చేయడం లాంటివి చూస్తుంటే మరో నెలరోజుల్లో గుడ్ న్యూస్ చెబుతారేమో అనిపిస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com